E KABURU - Digital News Paper
E-PAPER
ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 10-05-2026 (వారం) ఆదివారం సంపుటి: 02 || సంచిక:128 || పేజీలు–6
www.ekaburu.com

జన్ సురక్ష పథకాల్లో రూ.25,160 కోట్ల క్లెయిమ్‌ల పరిష్కారం

04

06

శ్రేయస్ అయ్యర్ కాదు..
టీ20 కెప్టెన్‌గా
సంజు శాంసన్!

ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన తర్వాత టీమ్‌ఇండియాలో కీలక మార్పులు జరగబోతున్నాయి. ఇప్పటికే ఆ దిశగా సంకేతాలు కనిపిస్తున్నాయి.

03

మిషన్ తెలంగాణకు షా స్కెచ్

బీఆర్ఎస్ నేతలే వారి టార్గెట్
హైదరాబాద్‌లో తిష్ట వేయనున్న బెంగాల్ టీమ్

02

ప్రధానమంత్రి కార్యక్రమాలకు ముఖ్యమంత్రికి ఆహ్వానం

సిగ్నల్ ఫ్రీ సిటీగా
హైదరాబాద్

అండర్‌పాస్‌లు, ఉపరితల రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్‌లు నిర్మిస్తాం
ట్రాఫిక్ నియంత్రణకు రహదారుల విస్తరణ ఒక్కటే సరిపోదు..
పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు విప్లవాత్మక నిర్ణయమని కమిటీ కితాబు

ఈ-కబురు, హైదరాబాద్:
హైదరాబాద్‌ను సిగ్నల్ ఫ్రీ నగరంగా మార్చాలన్న లక్ష్యంతో తమ ప్రభుత్వం ముందుకెళ్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణకు కేవలం రహదారుల విస్తరణ ఒక్కటే సరిపోదని, బహుళ విధానాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచాల్సి ఉంటుందన్నారు.

మిగతా 2లో

నేడు తెలంగాణకు
ప్రధాని మోదీ

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధాని సభకు ఏర్పాట్లు పూర్తి
రూ. 9,400 కోట్ల విలువైన పలు ప్రాజెక్టుల ప్రారంభం, శంకుస్థాపనలు
జన సమీకరణలో బీజేపీ రాష్ట్ర నాయకత్వం తలమునకలు

02

విజయ్‌కి లైన్‌క్లియర్

నేడే తమిళనాడు సీఎంగా జోసెఫ్ విజయ్ ప్రమాణం
ఉదయం 10 గంటలకు నెహ్రూ స్టేడియంలో సంరంభం
వీసీకే, ఐయూఎంఎల్, లెఫ్ట్ పార్టీల మద్దతుతో మేజిక్ ఫిగర్ దాటిన టీవీకే
చివరకు గవర్నర్ గ్రీన్‌సిగ్నల్.. ఈ మేరకు లోక్‌భవన్ అధికారిక ప్రకటన
సంబరాల్లో టీవీకే శ్రేణులు.. సస్పెన్స్ థ్రిల్లర్‌కి శుభం కార్డు

ఈ-కబురు, చెన్నై:
తమిళనాడులో నూతన ప్రభుత్వ ఏర్పాటులో నెలకొన్న సందిగ్ధ నిశ్శబ్ద వాతావరణంలో విజయ్ విజిల్ ఎట్టకేలకు గట్టిగా మోగింది. ఐదు రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరదించుతూ ఐదు పార్టీలు అందించిన మద్దతుతో చివరకు విజయ్ సారథ్యంలోని టీవీకే పార్టీ తొలిసారిగా తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. దీంతో నేటి (ఆదివారం) ఉదయం 10 గంటలకు చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ సమక్షంలో విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయనున్నారు. 234 మంది సభ్యులున్న శాసనసభలో కనీస మెజారిటీ (118) ని మించి ఎమ్మెల్యేల మద్దతును కూడగట్టడంలో సఫలీకృతుడుకావడంతో విజయ్‌ను ముఖ్యమంత్రిగా నియమిస్తూ గవర్నర్ నిర్ణయం తీసుకున్నారని శనివారం తమిళనాడు లోక్‌భవన్ ఒక అధికారిక ప్రకటన విడుదలచేసింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని విజయ్‌ను గవర్నర్ ఆహ్వానించారు.

మిగతా 2లో

సంఖ్యాబలం సమకూరిందిలా..

టీవీకే	107
కాంగ్రెస్	5
సీపీఐ	2
సీపీఎం	2
వీసీకే	2
ఐయూఎంఎల్	2
మొత్తం బలం	120

ప్రధాని మోడీకి టీఆర్ఎస్ చీఫ్
కవిత బహిరంగ లేఖ

తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించి నాలుగు కీలక అంశాలు ప్రస్తావన

ఈ-కబురు, హైదరాబాద్
ప్రధాని నరేంద్రమోడీ తెలంగాణ పర్యటనకు రానున్న నేపథ్యంలో తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై సత్వరమే నిర్ణయం తీసుకోవాలంటూ తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ ఆయన లేఖ రాశారు. పాలమూరురంగారెడ్డి కి జాతీయ హోదా, జనగణనలో బీసీ గణన, మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా, తెలంగాణ బీసీ బిల్లుకు ఆమోదం తెలపాలంటూ లేఖలో కోరారు. వాటికి సంబంధించి వివరాలను లేఖలో పేర్కొన్నారు.

మిగతా 3లో

దేశమంతా తిరుగుతా..
మోదీని గద్దె నుంచి దింపుతా
వీహెచ్ సంచలన ప్రకటన

ఈ-కబురు,, హైదరాబాద్:
ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనను వ్యతిరేకిస్తూ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు (వీహెచ్) పోరాట బాట పట్టారు. జాతీయ స్థాయిలో చేపట్టబోయే జనగణనలో భాగంగా బీసీ కులగణనను కూడా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఆయన నిరవధిక నిరాహార దీక్షకు దిగారు.

మిగతా 2లో

దివ్యాస్త్రం దిగ్విజయం

ఆధునీకరించిన అగ్ని–5 క్షిపణి పరీక్ష సక్సెస్
ఎంఐఆర్‌వీ టెక్నాలజీని పరీక్షించిన డీఆర్‌డీఓ
ఒకేసారి భిన్న లక్ష్యాలను ఛేదించే సత్తా

ఈ–కబురు, న్యూఢిల్లీ:
ఆధునిక సాంకేతికతను జోడించిన అగ్ని–5 క్షిపణిని భారత్ విజయవంతంగా పరీక్షించింది. ఇందుకు ఒడిశాలోని ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం వేదికైంది. ఎంఐఆర్‌వీ సాంకేతికతను జతచేసి అగ్ని క్షిపణికి శుక్రవారం పరీక్షించామని రక్షణశాఖ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ ప్రాజెక్ట్‌కు 'మిషన్ దివ్యాస్త్ర'అని పేరుపెట్టారు. మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీ–ఎంట్రీ వెహికల్(ఎంఐఆర్‌వీ) సాంకేతికత సాయంతో ఒకే క్షిపణి ద్వారా పలు వార్‌హెడ్‌లను ఏకకాలంలో ప్రయోగించవచ్చు. క్షిపణి కోసం శుక్రవారం తొలుత హిందూ మహాసముద్రజలాల్లో, భూతలంపై సుదూరాల్లోని వేర్వేరు ప్రాంతాలను లక్ష్యాలుగా

03

బెంగాల్ సీఎంగా సువేందు ప్రమాణం

- కోల్‌కతాలో అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవం
- ప్రధాని మోదీసహా బీజేపీ అగ్రనేతల హాజరు
- అధికారం కట్టబెట్టినందుకు ఓటర్లకు కృతజ్ఞతగా సాష్టాంగనమస్కారం చేసిన ప్రధాని
- వేదిక ప్రాంగణంలో ఝాల్‌మురీ స్టాళ్లు

ఈ–కబురు, కోల్‌కతా:
పోరాటాల గడ్డ పశ్చిమబెంగాల్‌లో కమలనాథుల పరిపాలనా శకానికి నాందిపలుకుతూ ప్రధాని మోదీ సమక్షంలో రాష్ట్ర అగ్రనేత సువేందు అధికారి శనివారం ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. తద్వారా రాష్ట్రంలో ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన తొలి బీజేపీ నాయకునిగా సువేందు చరిత్ర సృష్టించారు. ప్రధాని, కేంద్ర మంత్రులు, పలువురు బీజేపీ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎన్‌డీఏ కూటమి పార్టీల అగ్రనేతల సమక్షంలో అత్యంత అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. గవర్నర్ ఆర్ఎన్ రవి అధికారి చేత ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయించారు. తర్వాత ఉప్పొంగిపోయిన ప్రధాని తమకు అపూర్వ విజయాన్ని అందించిన బెంగాల్ ఓటర్లకు మోకాళ్లపై ఒంగి నేలకు తల ఆన్చి నమస్కారంచేశారు. ఈ సందర్భంగా బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లోని ప్రమాణస్వీకార ప్రాంగణం జైశ్రీరాం, భారత్ మాతాకీ జై నినాదాలతో మార్మోగిపోయింది. భవానీపూర్‌లో మమతా బెనర్జీని మట్టికరిపించి, నందిగ్రామ్‌లో విజయాన్ని సాధించిన సువేందుకు ప్రధాని ప్రమాణ స్వీకారం తర్వాత శుభాకాంక్షలు తెలిపారు.

మిగతా 3లో

నూతన సీడీఎస్‌గా సుబ్రమణి

తదుపరి నేవీ చీఫ్‌గా కృష్ణ స్వామినాథన్

ఈకబురు, న్యూఢిల్లీ: నూతన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్)గా లెఫ్టినెంట్ జనరల్ ఎస్ఎస్ రాజా సుబ్రమణి (రిటైర్డ్) ని కేంద్ర ప్రభుత్వం నియమించింది. త్రివిధ దళాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే బాధ్యతను ఆయనకు కట్టబెట్టింది. ప్రస్తుత సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ ఈ నెలలో పదవీ విరమణ చేయబోతున్నారు. ఆయన స్థానంలో రాజా సుబ్రమణి బాధ్యతలు స్వీకరిస్తారు.

మిగతా 3లో

తుమ్మిడిహెట్టిపై ఎవరి మాటలు నమ్మాలి?
భారాస సీనియర్ నేత హరీశ్ విమర్శ

ఈకబురు,సిద్దిపేట, : 'తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై పరిజ్ఞానం లేని మాటలతో మంత్రులు రాష్ట్ర పరువు తీస్తున్నారు. 150 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి నాటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో ఒప్పందం జరిగిందని మంత్రి వివేక్ మాట్లాడటం విడ్డూరం

మిగతా 2లో

గుజరాత్.. పైపైకి
ఏడో విజయంతో
రెండో స్థానానికి

ఐపీఎల్ 19 లీగ్ దశ ముందుకు సాగేకొద్దీ సమీకరణాలు మారిపోతున్నాయి. ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా మారుతోంది. పైనున్న జట్లు ఒకొక్కటిగా కిందికి దిగుతుంటే.. కింద ఉన్న జట్లు పైకి వెళ్తున్నాయి. కాస్త ఆలస్యంగా నిలకడ అందుకున్న గుజరాత్ టైటాన్స్..

06

సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్

పెరుగుతున్న నగరీకరణతో సమీప భవిష్యత్తులో మరిన్ని సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని, అందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. శనివారం సచివాలయంలో గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో రేవంత్ పాల్గొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) ప్రాంతం మొత్తంగా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడానికి కృతనిశ్చయంతో ఉన్నట్లు వెల్లడించారు. 'హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగ రంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం.

కీలకమైన ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, ఉపరితల రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్ వంటి మూడు విధానాల్లో సులభతరమైన రవాణా మార్గాలను కల్పించే విధానాన్ని ఎంచుకున్నాం. పార్కింగ్ ఇబ్బందులను అధిగమించేందుకు నగరంలో మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నాం'అని వివరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని క్యూర్, ఫ్యూర్, రేర్ విభాగాలుగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. కాలుష్య కోరల నుంచి హైదరాబాద్‌ను కాపాడటానికి మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు నగర సంస్కృతికి అనుసంధానించబోతున్నట్లు వివరించారు. నగర తాగునీటి సరఫరా, పట్టణాభివృద్ధి, మూసీ పునరుజ్జీవం తదితర అంశాలపై ప్రభుత్వ ప్రణాళికలను సమావేశంలో ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్టాండింగ్ కమిటీకి వివరించారు. నగర అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లడానికి కేంద్రం సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

పునరుజ్జీవ ప్రాజెక్టు దేశంలోనే మొదటిది: స్టాండింగ్ కమిటీ

స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ మాగుంట శ్రీనివాసులరెడ్డితోపాటు ఇతర సభ్యులు మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును విప్లవాత్మక నిర్ణయంగా అభివర్ణించారు. హైదరాబాద్ నగర జీవన స్థితిగతులను మెరుగుపరిచే మూసీ పునరుజ్జీవ తరహా ప్రాజెక్టు దేశంలోనే మొదటిదని అభిప్రాయపడ్డారు. ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టును చేపట్టడంపై కమిటీ ముఖ్యమంత్రిని అభినందించిది. దీంతోపాటు రాష్ట్రంలో మహిళాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను కొనియాడింది. అంతకుముందు స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్‌తోపాటు సభ్యులను ముఖ్యమంత్రి సత్కరించారు. తెలంగాణ రైజింగ్ -2047 విజన్ డాక్యుమెంట్‌ను కమిటీ సభ్యులకు అందజేశారు. సమావేశంలో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి కార్యక్రమాలకు
ముఖ్యమంత్రికి ఆహ్వానం

ఈకబురు,,హైదరాబాద్:
నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించనున్న పలు ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభోత్సవం, హైదరాబాద్‌పనాజీ ఎకానమిక్ కారిడార్‌లోని గుడెబల్లూర్‌మహబూబ్‌నగర్ నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన, కాజీపేటవిజయవాడ మల్టీ ట్రాకింగ్ పనులను హైదరాబాద్ హెచ్ఐసీసీ వేదికగా ప్రధానమంత్రి నేడు వర్చువల్‌గా చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలంటూ కేంద్ర ప్రభుత్వం తరపున జాతీయ రహదారుల శాఖ రీజినల్ ఆఫీసర్ కృష్ణప్రసాద్ శనివారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు.

దేశమంతా తిరుగుతా..
మోదీని గద్దె నుంచి దింపుతా

ఈకబురు,,హైదరాబాద్;
ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనను వ్యతిరేకిస్తూ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు (వీహెచ్) పోరాట బాట పట్టారు. జాతీయ స్థాయిలో చేపట్టబోయే జనగణనలో భాగంగా బీసీ కులగణనను కూడా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఆయన నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. హైదరాబాద్ అంబర్‌పేటలోని తన నివాసంలో ఉదయం పదిన్నర గంటలకు ఆయన ఈ దీక్షను ప్రారంభించారు. బీసీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అడ్డుపడుతోందని ఆరోపిస్తూ ఆయన ఈ నిరసన చేపట్టడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

బీసీల కాలమ్ లేకపోవడంపై ధ్వజం

దీక్ష సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశవ్యాప్తంగా నిర్వహించే జనగణన ఫారమ్‌లో బీసీల కోసం ప్రత్యేక కాలమ్ కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేస్తున్నప్పుడు దేశంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలు ఎందుకు కనబడటం లేదని ఆయన ప్రశ్నించారు. ఏటా బీసీల జనాభా పెరుగుతున్నా వారికి దక్కాల్సిన వాటా మాత్రం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం లెక్కలు తేలితేనే విద్య, ఉద్యోగాల్లో బీసీలకు సరైన న్యాయం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

ప్రధానికి లేఖలు.. ఎంపీలకు హెచ్చరిక

బీసీ కులగణనపై ప్రధాని మోడీకి ఇప్పటికే రెండుసార్లు లేఖలు రాసినట్లు వీహెచ్ వెల్లడించారు. ఆ లేఖలకు ఇప్పటివరకు ఎలాంటి సమాధానం రాలేదని ఆయన మండిపడ్డారు. ప్రధాని మోడీ తరచూ తనను తాను బీసీ బిడ్డగా చెప్పుకుంటారని.. మరి అదే బీసీలకు న్యాయం చేయడంలో ఎందుకు వెనుకాడుతున్నారని నిలదీశారు. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు ఈ విషయంలో ప్రధానిపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. బీసీల హక్కుల కోసం బీజేపీ నాయకులు నోరు విప్పకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

రాజకీయ విమర్శలు – మహిళా రిజర్వేషన్లు

బీజేపీ అనుసరిస్తున్న విధానాలు దేశాన్ని ముక్కలు చేసేలా ఉన్నాయని వీహెచ్ ఆరోపించారు. మతపరమైన అంశాలతో రాజకీయ ప్రయోజనాలు పొందాలని చూస్తున్నారని విమర్శించారు. ఇటీవల ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లులో కూడా బీసీ మహిళలకు ప్రత్యేక కోటా కేటాయించకపోవడం అన్యాయమని అన్నారు. దీనిపై కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంటులో గట్టిగా పోరాడారని గుర్తు చేశారు. బీసీల పట్ల కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే రిజర్వేషన్లలో ఉప కోటా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ పర్యటనపై అల్టిమేటం..

బీసీల డిమాండ్లపై స్పష్టమైన నిర్ణయం తీసుకున్న తర్వాతే ప్రధాని మోడీ తెలంగాణలో అడుగుపెట్టాలని వీహెచ్ స్పష్టం చేశారు. ఒకవేళ బీసీ కులగణనపై స్పష్టత ఇవ్వకుండా రాష్ట్రానికి వస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. తన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా పర్యటనకు వస్తే దేశవ్యాప్తంగా పర్యటించి బీజేపీ అసలు రంగును ఎండగడతానని ప్రకటించారు. బీసీలకు న్యాయం జరిగే వరకు తన పోరాటం ఆగదని.. ఈ దీక్ష ఒక ప్రారంభం మాత్రమేనని ఆయన పేర్కొన్నారు.

నేడు తెలంగాణకు ప్రధాని మోదీ

ఈకబురు, హైదరాబాద్: ప్రధాని మోదీ ఆదివారం తెలంగాణ పర్యటనకు రానున్నారు. మూడోసారి ప్రధాని అయిన రెండేళ్ల తర్వాత తొలిసారి రాష్ట్రానికి రానున్నందున మోదీ పర్యటనకు రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని తొలుత గచ్చిబౌలిలోని హెచ్ఐసీసీ నుంచి రూ. 9,400 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను వర్చువల్‌గా ప్రారంభించడంతోపాటు మరి కొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అనంతరం సాయంత్రం 6:30 గంటలకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న బీజేపీ బహిరంగ సభలో ఆ పార్టీ కార్యకర్తలు, ప్రజలను ఉద్దేశించి మోదీ ప్రసంగించనున్నారు. ఈ సభకు భారీ సమీకరణ ద్వారా సత్తా చాటేందుకు బీజేపీ రాష్ట్ర నాయకత్వం సర్వశక్తులు ఒడ్డి సన్నాహాల్లో తలమునకలైంది. అంచనాలకు మించి జనసమీకరణ, ప్రజలు, కార్యకర్తల హాజరు ద్వారా మోదీ సభను విజయవంతం చేసి సత్తా చాటాలనే పట్టుదలతో పార్టీ శ్రేణులున్నాయి. పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లుకు ప్రతిపక్షాలు అడ్డుకోవడంతో నియోజకవర్గాల పునర్విభజన బిల్లును కేంద్రం ఉపసంహరించుకోవడం, ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మూడింటిని (ఒకటి మిత్రపక్షంతో కలిసి) బీజేపీ కైవసం చేసుకున్న నేపథ్యంలో పార్టీపరంగా రాజకీయ అంశాలపై మోదీ ఏం మాట్లాడతారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

మోదీ పర్యటన షెడ్యూల్ ఇదీ...

మధ్యాహ్నం 2:20 గంటలకు కర్ణాటక నుంచి బేగంపేట విమానాశ్రయానికి రాక.

3 నుంచి 3:30 గంటల మధ్య గచ్చిబౌలిలోని హెచ్ఐసీసీలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు.

3:45-4:15 గంటల మధ్య హైటెక్ సిటీ సమీపంలో సింధు హాస్పటల్ ప్రారంభోత్సవం. అనంతరం ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు పరామర్శ.

సాయంత్రం 4:45 నుంచి 6:15 గంటల మధ్య బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో రిజర్వ్ టైమ్.

6:30 నుంచి 7:10 గంటల మధ్య సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బీజేపీ బహిరంగ సభలో ప్రసంగం.

రాత్రి 7:20 గంటలకు బేగంపేట నుంచి గుజరాత్‌లోని జామ్‌నగర్‌కు పయనం.

ప్రధాని ప్రారంభించే/శంకుస్థాపన చేసే ప్రాజెక్టులు ఇవే..

హైదరాబాద్-పనాజీ ఎకనమిక్ కారిడార్‌లో భాగంగా గుడెబెల్లూర్ నుంచి మహబూబ్‌నగర్ వరకు రూ. 3,175 కోట్ల ఖర్చుతో ఎన్‌హెచ్-167 ఫోర్ లేనింగ్ పనులకు శంకుస్థాపన. దీనిద్వారా రవాణా సమయం గంటన్నర దాకా తగ్గనుంది.

సంగారెడ్డి జిల్లాలో రూ. 2,350 కోట్ల వ్యయంతో జహీరాబాద్ పారిశ్రామిక ప్రాంతానికి శంకుస్థాపన. హైదరాబాద్-నాగపూర్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో 3,245 ఎకరాల్లో దీన్ని అభివృద్ధి చేయనున్నారు. ఎన్‌హెచ్-65 వెంట చేపడుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు రూ. 10 వేల కోట్ల పెట్టుబడులు, భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

వరంగల్‌లో పీఎం మిత్ర పథకం కింద రూ. 1,700 కోట్లతో అభివృద్ధి చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్‌ను ప్రధాని ప్రారంభిస్తారు. ఇది దేశంలోనే పూర్తిస్థాయిలో పనిచేస్తున్న తొలి పీఎం మిత్ర పార్క్‌గా నిలవనుంది. కేంద్ర ప్రభుత్వ ఫైవ్-ఎఫ్ విజన్‌లో భాగంగా ఫామ్ టు ఫైబర్ టు ఫ్యాక్టరీ టు ఫ్యాషన్ టు ఫారెన్‌గా పనిచేయనుంది. ప్రతిపాదిత నాగపూర్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే (ఎన్‌హెచ్-163 జీ)కి సమీపంలో మేజర్ రైల్వే నెట్‌వర్క్స్, సీ-పోర్టులకు కనెక్టివిటీ అందించనుంది. జాతీయ స్థాయిలో ముఖ్యమైన రూ. 1,535 కోట్ల విలువైన రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను జాతికి అంకితం చేస్తారు. కాజీపేట-విజయవాడ రైల్వే మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులో పలు సెక్షన్లను కవర్ (118 కి.మీ) చేయనున్నాయి. రద్దీగా ఉండే గ్రాండ్‌ట్రంక్ కారిడార్‌లో లైన్ కెపాసిటీని పెంపొందించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడనుంది. దీని ద్వారా వేగవంతమైన రైళ్ల కార్యకటాపాలు, సమయపాలన మెరుగదల, సరుకు రవాణా వేగవంతానికి దోహదపడనుంది. ఈ సందర్భంగా కాజీపేట రైల్ అండర్ రైల్ బైపాస్‌ను ప్రధాని జాతికి అంకితం చేయనున్నారు. కాజీపేట జంక్షన్‌లో సాఫీగా రవాణా సాగేలా దోహదపడటంతోపాటు హైదరాబాద్, బలార్షా, విజయవాడ వైపు రైళ్ల రాకపోకలు వేగంగా సాగేలా సహాయపడనుంది.

హైదరాబాద్ శివార్లలోని మల్కాపూర్‌లో రూ. 600 కోట్లతో అభివృద్ధి చేసిన ఇండియన్ అయిల్ టెర్మినల్ ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తారు.

హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ సమీపంలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన 1,500 పడకల 'సింధు కేన్సర్ హాస్పిటల్'ను మోదీ జాతికి అంకితం చేయనున్నారు. లాభాపేక్ష లేని సంస్థ ద్వారా కేన్సర్ చికిత్స కేంద్రీకృతంగా మల్టీ-సూపర్ స్పెషాలిటీ క్వార్టర్నరీ కేర్‌ను అందించనున్నారు.

విజయ్‌కి లైన్‌క్లియర్

ఈకబురు, చెన్నై: తమిళనాడులో నూతన ప్రభుత్వ ఏర్పాటులో నెలకొన్న సందిగ్ధ నిశ్శబ్ద వాతావరణంలో విజయ్ విజిల్ ఎట్టకేలకు గట్టిగా మోగింది. ఐదు రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరదించుతూ ఐదు పార్టీలు అందించిన మద్దతుతో చివరకు విజయ్ సారథ్యంలోని టీవీకే పార్టీ తొలిసారిగా తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. దీంతో నేటి (ఆదివారం) ఉదయం 10 గంటలకు చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ సమక్షంలో విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయనున్నారు. 234 మంది సభ్యులున్న శాసనసభలో కనీస మెజారిటీ (118)ని మించి ఎమ్మెల్యేల మద్దతును కూడగట్టడంలో సఫలీకృతుడుకావడంతో విజయ్‌ను ముఖ్యమంత్రిగా నియమిస్తూ గవర్నర్ నిర్ణయం తీసుకున్నారని శనివారం తమిళనాడు లోక్‌భవన్ ఒక అధికారిక ప్రకటన విడుదలచేసింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని విజయ్‌ను గవర్నర్ ఆహ్వానించారు. మే 13వ తేదీ లేదా అంతకన్నాముందే బలనిరూపణకు సిద్ధంగా ఉండాలని అధికారిక ఉత్తర్వులో విజయ్ పార్టీకి గవర్నర్ సూచించారు. అధికారిక ఉత్తర్వు వార్త తెలిసి తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ శ్రేణుల్లో సంబరాలు అంబరాన్నంటాయి. తమిళనాడు వ్యాప్తంగా టీవీకే మద్దతుదారులు పెద్దమొత్తంలో బాణసంచా కాల్చారు. మిఠాయిలు పంచి ఆనందాన్నీ పంచుకున్నారు.

మద్దతుతో ముందుకు...

తొలుత ఐదుగురు సభ్యులున్న కాంగ్రెస్ మాత్రమే టీవీకే పార్టీకి మద్దతు పలకగా తర్వాత సీపీ(2)ఎం, సీపీఐ(2) వెంట నడిచాయి. శనివారం విదుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) సైతం కలిసివస్తామని హామీ ఇవ్వడంతో 107 ఎమ్మెల్యేలున్న టీవీకే పార్టీకి మొత్తం బలం ఒకేసారి 120కి పెరిగింది. వెనువెంటనే గవర్నర్‌కు మేజిక్ ఫిగర్ అంశాన్ని తెలియజేసేందుకు విజయ్ లోక్‌భవన్‌కు బయల్దేరగా అపాయింట్‌మెంట్ చివరినిమిషంలోనూ ఖరారుకాకపోవడంతో మార్గమధ్యంలోనే నిరాశగా వెనుతిరిగారు. పదేపదే తిప్పుతూ గవర్నర్ ఉద్దేశపూర్వకంగా విజయ్‌ను వేధిస్తున్నారని వెంటనే సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.వీ రపాండియన్ అన్నారు. నిష్క్రమించిన కొద్దిసేపటికే సాయంత్రం ఆరుగంటల తర్వాత గవర్నర్ నుంచి విజయ్‌కు పిలుపు వచ్చింది.

ఈసారి కాంగ్రెస్ తమిళనాడు రాష్ట్ర చీఫ్ కె.సెల్వపెరుంథగై, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం, సీపీఎం ముఖ్య నేత బాలకృష్ణన్, వీసీకే ముఖ్యనేతలతో కలిసి గవర్నర్‌తో సమావేశమయ్యారు. 120 మంది ఎమ్మెల్యేల మద్దతు తనకుందని స్పష్టంచేస్తూ జాబితాను గవర్నర్‌కు విజయ్ బృందం అందజేసింది. గంటకుపైగా సుదీర్ఘ భేటీ తర్వాత విజయ్ మెజార్టీని అంగీకరిస్తూ తదుపరి ప్రభుత్వ ఏర్పాటుకు ఉన్న అడ్డంకులను గవర్నర్ తొలగించారు. తమిళనాడు తదుపరి సీఎంగా మీరే ఉండాలంటూ సంబంధిత లేఖను విజయ్‌కు గవర్నర్ అందజేశారు. దీంతో సీఎంగా విజయ్ ప్రమాణస్వీకారానికి శ్రీకారం చుట్టినట్లయింది. విజయ్ సారథ్యంలోని ప్రభుత్వానికి బేషరతుగా మద్దతు తెలుపుతున్నట్లు వీసీకే, ఐఎంయూఎల్ తెలిపాయి. కానీ తాము ఇంకా డీఎంకే సారథ్యంలోని కూటమిలోని కొనసాగుతామని, టీవీకే సర్కార్‌కు బయటి నుంచి మద్దతు ఇస్తామని వీసీకే ప్రకటించడం గమనార్హం.

వీసీకేతో మారిన పరిణామాలు

సీపీఎం, సీపీఐలు అధికారికంగా మద్దతు ఇచ్చినా, వీసీకే నేత థోల్ తిరుమావళవన్ నుంచి ఎలాంటి సమాచారం లేక పోవడంతో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్కంఠ భరిత వాతావరణం నెలకొంది. కేరళకు గవర్నర్ వెళ్లిపోతున్నట్లు సమాచారం రావడంతో మెజార్టీ నిరూపణ, ఆదివారం ప్రమాణస్వీకారంపై నీలినీడలు కమ్ముకున్నాయి. అయితే హఠాత్తుగా వీసీకే చీఫ్ వైఖరిలో మార్పువచ్చింది. రాష్ట్రపతిపాలన వంటి ప్రమాదంలేకుండా రాష్ట్రంలో స్థిరప్రభుత్వం ఏర్పడాలనే సుదుద్దేశంతో విజయ్‌కు మద్దతు ఇస్తానని తిరుమావళవన్ ప్రకటించడంతో పరిణామాలువేగంగా మారాయి. రెండు స్థానాలున్న వీసీకే మద్దతుతో టీవీకే బలం మరింత పెరిగింది. తర్వాత చిట్టచివరకు ఐయూఎంఎల్ సైతం తమ ఇద్దరు ఎమ్మెల్యేలు మీతోనడుస్తారని మాట ఇవ్వడంతో టీవీకే కీలక మేజిక్ ఫిగర్‌ను దాటింది. తర్వాత గవర్నర్ దగ్గరకు వెళ్లడం, ఇప్పటికే టీవీకే శాసనసభాపక్షనేతగా ఎన్నికయ్యానని విజయ్ చెప్పడం, గవర్నర్ ఆమోదం చకచకా జరిగిపోయాయి. అయితే మంత్రివర్గ కేటాయింపులో వీసీకే గట్టిగా పట్టుబట్టవచ్చనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఐదు పార్టీల మద్దతుతో ఏర్పడుతున్న ప్రభుత్వంలో సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని ఏ పార్టీ నేతలకు కీలక శాఖలు అప్పగిస్తారనే ఇంకా చిక్కుముడిగానే ఉంది.

ప్రమాణస్వీకారానికి రాహుల్‌గాంధీ రాక

నేడు చెన్నైలో జరిగే ప్రమాణస్వీకారానికి కాంగ్రెస్ తరపున ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరవుతారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. సీఎంగా ప్రమాణంచేయబోతున్న విజయ్‌కు రాష్ట్ర కాంగ్రెస్ నేత మాణిక్యం ఠాకూర్ శుభాకాంక్షలు తెలిపారు.

ముఖ్య నేతలకు మంత్రి పదవులు!

టీవీకే ముఖ్య నేతలకు పదవులు ఇవ్వడానికి విజయ్ ఇప్పటికే ఒక జాబితా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ప్రజా పరిపాలన, హోంశాఖ తన వద్ద అట్టిపెట్టుకుని పార్టీ కచ్చినర్ సెంగొట్టయన్‌కు ప్రజా పనులు, పార్టీ ప్రధాన కార్యదర్శి బస్సీ ఆనంద్‌కు మునిసిపల్ శాఖ, పార్టీ ప్రచార డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆధవ్ అర్జునకు క్రీడలు, ఎక్సైజ్ శాఖ, పార్టీ సంయుక్త కార్యదర్శి సీటీఆర్ నిర్మల్ కుమార్‌కు విద్యుత్, పార్టీ ముఖ్య నేత అరుణ్ రాజ్‌కు రిజిస్ట్రేషన్లు, వాణిజ్య పన్నులు శాఖ, పార్టీ కోశాధికారి వెంకటరామన్‌కు పాఠశాల విద్యాశాఖ, రాజ మోహన్‌కు ఆది ద్రావిడ సంక్షేమం, ముస్తఫాకు మైనారిటీ సంక్షేమ శాఖ అప్పగించే విధంగా తొలి జాబితా సిద్ధమైనట్టుగా తమిళనాడు మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.

కాంగ్రెస్‌కు ఒక మంత్రి పదవి అప్పగిస్తున్నట్టు పేర్కొంటున్నాయి. సీఎంగా ప్రమాణ స్వీకారం అనంతరం ప్రోటెం స్పీకర్ నియామకం తర్వాత బల నిరూపణకు విజయ్ వ్యూహ రచన చేస్తున్నట్టు తెలిసింది. అంతకుముందు అమ్మ మక్కల్‌మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ఏకైక ఎమ్మెల్యే ఎస్.కామరాజ్ సైతం తమకు మద్దతిస్తున్నారని టీవీకే తెలిపింది. ఆయన మద్దతిచ్చే లేఖ ఫోర్జరీది అని ఏఎంఎంకే చీఫ్ టీటీవీ దినకరన్ ఆరోపించారు. ఈ మేరకు గుండీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దినకరన్ ఆరోపణలను టీవీకే కొట్టిపారేసింది. కామరాజ్ స్వయంగా రాసిన మద్దతు లేఖ వీడియోను టీవీకే బహిర్గతంచేసింది.





తుమ్మిడిహెట్టిపై
ఎవరి మాటలు నమ్మాలి?

ఈకబురు,సిద్దిపేట, : 'తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై పరిజ్ఞానం లేని మాటలతో మంత్రులు రాష్ట్ర పరువు తీస్తున్నారు. 150 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి నాటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో ఒప్పందం జరిగిందని మంత్రి వివేక్ మాట్లాడటం విడ్డూరం. అదే నిజమైతే తుమ్మిడిహెట్టి వద్ద కాకుండా చేవెళ్ల వద్ద పనులు ఎందుకు ప్రారంభించారు? మరో మంత్రి జూపల్లి బ్యారేజీ కడితే గ్రావిటీ ద్వారా ఎల్లంపల్లికి నీళ్లు పోతాయంటున్నారు. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి లిఫ్టుతో నీళ్లు తెస్తామని, సీఎం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బ్యారేజీ కట్టి సుందిళ్లకు నీళ్లు అందిస్తామని చెబుతున్నారు. వీరిలో ఎవరి మాట నమ్మాలో ప్రజలకు అర్థంకావడం లేదు' అని భారాస సీనియర్ నేత హరీశ్‌రావు మండిపడ్డారు. సిద్దిపేటలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాష్ట్ర ప్రయోజనాలు పట్టడం లేదు. బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి సీఎం బహిరంగ లేఖ రాయడం ఎంతవరకు సమంజసం? నాడు ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును రూ.17 వేల కోట్లతో ప్రారంభించగా జాప్యం కారణంగా రూ.40 వేల కోట్లకు పెరిగింది. సర్వే మొబిలైజేషన్ అడ్వాన్సుల కింద రూ.2,300 కోట్ల బిల్లులు తీసుకున్నారు. ఇప్పుడు అవినీతి గురించి మాట్లాడటం విడ్డూరం. ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టుకు 202425లో రూ.2 కోట్లు, 202526లో రూ.30 కోట్లు, ఈసారి బడ్జెట్‌లో రూ.50 కోట్లు ప్రతిపాదించారు. బ్యారేజీ నిర్మాణానికే రూ.5 వేల కోట్లు అయితే ప్రతిపాదిత సొమ్ము దేనికి సరిపోతుంది? నాడు తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం కోసం భారాస (తెరాస) ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లోనే కేసీఆర్ నాయకత్వంలో మహారాష్ట్ర సీఎం, మంత్రులను కలిశాం. అక్కడ వైల్డ్‌లైఫ్ ఫారెస్టు, ఎకో సెన్సిటివ్ జోన్ కూడా ఉంది. మహారాష్ట్ర భూభాగం ముంపునకు గురవుతుంది. బ్యారేజీ నిర్మాణానికి అనుమతి రావాలంటే సుప్రీం కోర్టులోని హైలెవల్ కమిటీని ఒప్పించాలి. కాళేశ్వరాన్ని తక్కువ చేసి మాట్లాడితే రాష్ట్రానికి, జాతికి ద్రోహం చేసినట్లే. ప్రస్తుతం మండుటెండల్లోనూ 6,400 క్యూసెక్కుల నీళ్లు ప్రవహిస్తున్నాయి. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా మేడిగడ్డ వద్ద మూడు పియర్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలి. భారాస నేత క్రిశాంక్‌ను కేసులతో రాజకీయ వేధింపులకు గురి చేస్తున్నారు. కరీంనగర్‌లో బంగారు దుకాణంలో చోరీ జరిగితే దొంగలను పట్టుకోవడం లేదు. మఫ్టీలో ఉన్న మల్కాజిగిరి సీపీ సుమతికి పోకిరీల నుంచి ఎదురైన పరిస్థితి చూస్తే హైదరాబాద్‌లో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయో అర్థమవుతోంది. విశ్రాంత ఐపీఎస్ భార్య దారుణ హత్య జరిగితే నిందితులను పట్టుకోలేదు. రేవంత్‌రెడ్డి సీఎంగా, హోంమంత్రిగా విఫలమయ్యారు' అని హరీశ్‌రావు విమర్శించారు.

ఒకే బొందలో ఎంతమందిని పూడ్చాలి ?

- క్రిస్టియన్ల స్మశాన వాటిక సరిపోక ఇబ్బందులు
- ప్రభుత్వం పది ఎకరాలు కేటాయించాలన్న పాస్టర్లు

ఈ-కబురు, పటాన్‌చెరు :
స్మశాన వాటికలో స్థలం లేక ఒకే బొందలో చనిపోయిన కుటుంబ సభ్యులందరినీ పూడ్చాల్సిన పరిస్థితి ఏర్పడిందని సంగారెడ్డ జిల్లా పటాన్‌చెరు సెగ్మెంట్ పాస్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. రామచంద్రాపురంలో ఉన్న క్రిస్టియన్ స్మశాన వాటిక ఇబ్బందులపై పటాన్‌చెరు పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రశాంత్, ఉపాధ్యక్షుడు శంకర్, జనరల్ సెక్రటరీ జోసెఫ్, అసెంబ్లీ కోఆర్డినేటర్ సుజీవన్ డిన్నూ తదితరులు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మశాన వాటికలు సరిపోక వంశపార పర్యంగా ఒకే బొందలో చనిపోయిన వారందరినీ పూడుస్తున్నామని, స్మశాన వాటికకు మరికొంత స్థలం కావాలని అడిగితే బీహెచ్ ఈఎల్ యాజమాన్యం ఒప్పుకోవడం లేదని అన్నారు. నియోజకవర్గంలో 50 వేల మంది క్రిస్టియన్లు ఉన్నారని, వారందరికీ సరిపడే విధంగా ప్రభుత్వం 10 ఎకరాల స్థలాన్ని స్మశాన వాటిక కోసం కేటాయించాలని వారు కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్రిస్టియన్లకు అండంగా ఉందని, ఈ విషయంలో కూడా సీఎం రేవంత్ రెడ్డి స్పందించి స్మశాన వాటికలకు స్థలం మంజూరు చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నిస్సీ డానియల్, ప్రవీణ్ కుమార్, హారతి, ప్రసాద్, దిలీప్, సామ్యూల్, విల్సన్, అగస్టీన్, సామ్యూల్ మనోహర్, ప్రవీణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పటాన్‌చెరు పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ప్రధాని మోడీకి టీఆర్ఎస్ చీఫ్ కవిత బహిరంగ లేఖ

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి (PRLIS) "జాతీయ హోదా":
మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ వంటి కరువు ప్రాంతాలకు ఈ ప్రాజెక్టు జీవనాడి లాంటిది. 12.31 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలి. 90 శాతం కేంద్రం నిధులతో వెంటనే ప్రాజెక్ట్ ను పూర్తి చేయాలి.

2027 జనగణనలో బీసీ గణన:

దేశంలో బీసీల జనాభాపై కచ్చితమైన గణాంకాలు లేవు. దీని కారణంగా ఆయా వర్గాలకు అందాల్సిన అభివృద్ధి పథకాలు అందరికీ చేరడం లేదు. అందువల్ల రాబోయే 2027 జనాభా లెక్కల్లో బీసీల కోసం ప్రత్యేక కాలమ్‌ను చేర్చాలి. వారి కులాల పేర్లు స్పష్టంగా పేర్కొనేలా జనాభా గణన ఉండాలి.

మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ సబ్ కోటా:
చట్టసభల్లో మహిళలకు కేటాయించే 33 శాతం రిజర్వేషన్లలో బీసీ మహిళలకు ప్రత్యేక సబ్ కోటా కల్పించాలి. అప్పుడు మాత్రమే వెనుకబడిన వర్గాల మహిళలకు రాజకీయంగా సమాన అవకాశాలు లభిస్తాయి. బిల్లులో కచ్చితంగా ఈ సవరణ చేయాల్సిందే.

తెలంగాణ బీసీ బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం:
తెలంగాణ ప్రభుత్వం విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ బిల్లు చేసింది. దీనికి రాష్ట్రపతి ఆమోదం పొందేలా కేంద్రం సహకరించాలి. ఈ నాలుగు డిమాండ్లను పేర్కొంటూ ప్రధాని మోడీకి కవిత లేఖ రాశారు. తెలంగాణకు మేలు చేసే ఈ అంశాలపై రాష్ట్ర బీజేపీ ఎంపీలు దృష్టి సారించాలన్నారు. ఈ అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లి ఆయనను ఒప్పించాలని కోరారు

బెంగాల్ సీఎంగా సువేందు ప్రమాణం

తర్వాత ఉప్పొంగిపోయిన ప్రధాని తమకు అపూర్వ విజయాన్ని అందించిన బెంగాల్ ఓటర్లకు మోకాళ్లపై ఒంగి నేలకు తల ఆన్చి నమస్కారంచేశారు. ఈ సందర్భంగా బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లోని ప్రమాణస్వీకార ప్రాంగణం జైశ్రీరాం, భారత్ మాతాకీ జై నినాదాలతో మార్మోగిపోయింది. భవానీపూర్‌లో మమతా బెనర్జీని మట్టికరిపించి, నందిగ్రామ్‌లో విజయాన్ని సాధించిన సువేందుకు ప్రధాని ప్రమాణ స్వీకారం తర్వాత శుభాకాంక్షలు తెలిపారు.
సువేందు తర్వాత సీనియర్ బీజేపీ నేత దిలీప్ ఘోష్, అగ్నిమిత్ర పాల్, అశోక్ కీర్తనీయ, క్షుదిరాం టుడు, నితీశ్ ప్రామాణిక్‌లు కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేశారు. బ్రాహ్మణ, ఓబీసీ, గిరిజన, కాయస్థ, మధువా, రాజ్‌వంశీ ఇలా ఆరు సామాజిక వర్గాలకు చెందిన నేతలను కేబినెట్‌లోకి తీసుకుని బీజేపీ తమ సామాజిక సమానత్వాన్ని చాటింది. రాష్ట్రంలో ఉత్తర, దక్షిణ ప్రాంతాల నేతలకు సమప్రాధాన్యతనిచ్చింది. సోమవారం రాజ్‌భవన్‌లో మరికొందరు నేతలు మంత్రులుగా ప్రమాణంచేయనున్నారు. ప్రమాణంచేసిన మంత్రులకు ఇంకా శాఖలను కేటాయించలేదు. సోమవారం శాఖలను కేటాయించి తొలి కేబినెట్ సమావేశం నిర్వహించనున్నారు.
పెద్దసంఖ్యలో హాజరైన కమలదళ సభ్యులు తొలిసారిగా రాష్ట్రంలో అధికారంలోకి రాబోతున్న క్షణాలను చిరస్మరణీయంగా మార్చాలని బీజేపీ నిర్ణయించింది. ఇందుకోసం భారీసంఖ్యలో అభిమానులు, కార్యకర్తలను తరలించారు. ప్రాంగణమంతా భారీ ఎల్ఈడీ తెరలను ఏర్పాటుచేసి సువేందు, మోదీల పాత ప్రసంగాలను ప్రసారంచేశారు. ప్రమాణ స్వీకారాన్ని ప్రత్యక్ష ప్రసారంచేశారు. పార్టీ జెండాలరెపరెపలతో ప్రాంగణం కాషాయమయమైంది.
''ఈరోజు కోసం ఎన్నాళ్ల నుంచో వేచిచూస్తున్నా. ఎట్టకేలకు మా ప్రభుత్వం వచ్చింది. ఇక టీఎంసీ అరాచకాలకు చెట్లుచీటీ పడుతుంది. సరిహద్దు ఆవలినుంచి చొరబాట్లు ఆగిపోతాయి. అరాచకాలను తట్టుకోలేకనా కుమారుడు సొంత రాష్ట్రం నుంచి వలసపోయాడు. ఇప్పుడు తిరిగొస్తాడు''అని 80 ఏళ్ల భగవతీదేవి చెప్పారు. హిందు ప్రభుత్వపాలన ఆరంభాన్ని కళ్లారా చూసేందుకు వచ్చానని 70ఏళ్ల నవదీప్‌ప్ మర్‌లో ప్రజ్ఞాన్ మహరాజ్‌అనే సాధువు చెప్పారు. బీజేపీ ప్రభుత్వం కొలువుతీరే క్షణాలను కళ్లారా చూడాలని కెనడానుంచి వచ్చానని 50 ఏళ్ల వ్యక్తి చెప్పారు.
ప్రత్యేక ఆకర్షణగా ఝాల్‌మురీ..
ప్రచారంవేళ ప్రధాని రుచిచూసిన బెంగాలీ చిరుతిండి ఝాల్‌మురీ శనివారం ప్రమాణస్వీకార ప్రాంగణంలో అందర్నీ నోరూరించింది. బీజేపీ నేతలు ప్రత్యేకంగా ఈ స్టాళ్లను ప్రాంగణంలో ఏర్పాటుచేశారు. మరవరాలు, పచ్చి మిరప, మసాలా దినుసులతో ఝాల్‌మురీ చేస్తారు. దీనిని తినేందుకు పెద్దసంఖ్యలో జనం ఎగబడ్డారు. 20 స్టాళ్లు సరిపోక సొంతంగా కొందరు వ్యాపారులు సైతం స్టాళ్లు పెట్టుకున్నారు. ''ఝాల్‌మురీ కాస్తంత ఘాటుగాఉంటుంది. కానీ బీజేపీ విజయానికి గుర్తుగా తీపి జోడించాం. అయినా వేగంగా సరుకు అమ్ముడపోయింది''అని 24 నార్త్‌పరగణాల జిల్లా నుంచి స్టాల్ పెట్టిన మనీశ్ యాదవ్ చెప్పారు. బీజేపీ జెండా రంగుల్లో తయారుచేసిన రసగుల్లా అయితే హాట్‌కేకులా అమ్ముడుపోయింది. ''మామూలుగా దొరికే ఝాల్‌మురీ కంటే ఇక్కడి ఝాల్‌మురీ నిజంగా బాగుంది''అని కోల్‌కతాలోని గోలీగంజ్ వాసి మంజరి బసు అన్నారు.

కదలివచ్చిన తారాలోకం

ప్రమాణ స్వీకారోత్సవంలో బెంగాలీ సినీలోకం తరలివచ్చింది. ఫిల్మ్, ఎంటర్‌టైన్‌మెంట్ రంగం నుంచి పలువురు ప్రముఖులు కార్యక్రమానికి విచ్చేశారు. ప్రసేన్‌జీత్ ఛట్జీ, జీషు సేన్‌గుప్తాలతోపాటు శాస్త్రీయ కళాకారులు పండిత్ అజయ్ చక్రవర్తి, డ్యాన్సర్ మమతా శంకర్, నటుడు రిషి కౌశిక్, పాయల్ సర్కార్‌సహా బెంగాలీ టెలివిజన్ రంగ ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు.
వాళ్లకు న్యాయం చేయాలి: సీఎం తల్లి
సువేందు సీఎంగా ప్రమాణం చేశాక ఆయన తల్లిదండ్రులు గాయత్రి, సిసిర్ అధికారులు అమితానందం వ్యక్తంచేశారు. తూర్పు మేదినీపూర్‌లోని కాంతి పట్టణంలో సొంతింట్లో వాళ్లు మాట్లాడారు. ''మాకొడుకు సీఎం అయ్యాడని మాకంటే ఎక్కువగా బెంగాలీ ప్రజలే సంతోషిస్తున్నారు. సువేందు హయాంలో ఇకనైనా ఆర్జీకర్ వైద్యురాలి హత్యోదంతంలో బాధితులకు న్యాయం జరగాలి. ఇలాంటి అకృత్యాల్లో నిందితులకు కఠినంగా శిక్షలుపడేలా చేయాలని కోరుకుంటున్నా''అని తల్లి గాయత్రి అన్నారు. సువేందు తండ్రి సిసిర్ గతంలో మూడుసార్లు ఎంపీగా గెలిచారు.

బీజేపీ అమరులకు మోదీ నివాళులు

గత 15 ఏళ్లలో మమతాబెనర్జీ ప్రభుత్వ హయాంలో టీఎంసీ దాడుల్లో మృతిచెందిన బీజేపీ నేతలు,కార్యకర్తలకు నివాళిగా ఏర్పాటుచేసిన తాత్కాలిక స్మారకం వద్ద ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా అంజలి ఘటించారు. ప్రమాణస్వీకార ప్రాంగణంలో ఈ స్మారకం ఏర్పాటుచేశారు. ''కోల్‌కతాలో ఓవైపు బీజేపీ తొలి సర్కార్ కొలువుతీరుతుంటే మేం మాత్రం తొలుత టీఎంసీ అరాచకపాలనలో అమరులైన బీజేపీ కార్యకర్తలకు నివాళులర్పించాం. వీళ్ల త్యాగం సదా మాకు స్ఫూర్తిదాయకం''అని తర్వాత మోదీ తన 'ఎక్స్'ఖాతాలో పోస్ట్‌చేశారు.
వృద్ధ నేతకు మోదీ పాదాభివందనం

98 ఏళ్ల బీజేపీ నేత మఖన్‌లాల్ సర్కార్‌ను బీజేపీ ప్రత్యేకంగా వేదిక మీదకు ఆహ్వానించింది. శాలువా కప్పి ఆయన కాళ్లను ప్రధాని మోదీ మొక్కారు. తర్వాత ఆప్యాయంగా హత్తుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెల్సుకున్నారు. జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామప్రసాద ముఖర్జీతో కలిసి 1952లో కశ్మీర్‌లో త్రివర్ణపతాకాన్ని ఎగరేసిన బృందంలో మఖన్‌లాల్ ఉన్నారు. ఈ సందర్భంగా ఈయననూ అరెస్ట్‌చేశారు. ''స్వాతంత్ర్యానంతరం జాతీయోద్యమంలో చురుగ్గా పాల్గొని ఇప్పటికీ సజీవ స్ఫూర్తిగా ఉన్న అతికొద్ది మందిలో మఖన్‌లాల్ ఒకరు''అని బీజేపీ కొనియాడింది. 1980లో బీజేపీ ఏర్పడ్డాక పశ్చిమబెంగాల్‌లోని వెస్ట్ దినాజ్‌పూర్, జల్పాయ్‌గురి, డార్జిలింగ్ జిల్లాలకు మఖన్‌లాల్ సమన్వయకర్తగా సేవలందించారు. 1981 నుంచి ఏడేళ్లపాటు జిల్లా అధ్యక్షునిగా ఉన్నారు.

దివ్యాస్త్రం దిగ్విజయం

ఈ-కబురు న్యూఢిల్లీ: ఆధునిక సాంకేతికతను జోడించిన అగ్ని–5 క్షిపణిని భారత్ విజయవంతంగా పరీక్షించింది. ఇందుకు ఒడిశాలోని ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం వేదికైంది. ఎంఐఆర్‌వీ సాంకేతికతను జతచేసి అగ్ని క్షిపణికి శుక్రవారం పరీక్షించామని రక్షణశాఖ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ ప్రాజెక్ట్‌కు 'మిషన్ దివ్యాస్త్ర'అని పేరుపెట్టారు. మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీ–ఎంట్రీ వెహికల్(ఎంఐఆర్‌వీ) సాంకేతికత సాయంతో ఒకే క్షిపణి ద్వారా పలు వార్‌హెడ్‌లను ఏకకాలంలో ప్రయోగించవచ్చు. క్షిపణి కోసం శుక్రవారం తొలుత హిందూ మహాసముద్రజలాల్లో, భూతలంపై సుదూరాల్లోని వేర్వేరు ప్రాంతాలను లక్ష్యాలుగా నిర్దేశించారు.

''కలాం ప్రయోగకేంద్రంలోని లాంచర్ నుంచి దూసుకెళ్లిన అగ్ని-5 క్షిపణి నింగిలోకి అత్యంత ఎత్తుకు చేరాక కిందకు తిరిగొస్తూ వేర్వేరు ప్రాంతాల్లోని లక్షిత ప్రదేశాలను ఢీకొట్టేలా పేలోడ్‌లను జారవిడిచింది. ఇవన్నీ నిర్దేశిత లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించాయి. పేలోడ్‌ల వేగం, పథం నిర్దేశిత ప్రమాణాలను అందుకున్నాయి. దీంతో ఎంఐఆర్‌వీ సాంకేతికతను పరీక్షించేందుకు చేపట్టిన ప్రయోగం విజయవంతమైంది''అని రక్షణశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. భూతలంపై, నౌకలపై మోహరించిన ట్రాకింగ్ వ్యవస్థల సాయంతో ఈ ప్రయోగం ఫలితాలను విశ్లేషించి పరీక్ష విజయవంతమైందని నిర్ధారించుకున్నారు.
5,000 కిలోమీటర్ల పరిధిలో...
అగ్ని-1 క్షిపణి మొదలు అగ్ని-4 క్షిపణి దాకా అగ్నిరకం మిస్సైళ్లు 700 నుంచి గరిష్టంగా 3,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదిస్తాయి. అగ్ని-5 ఏకంగా 5,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలనూ తుత్తునియలు చేయగలదు. ఈ క్షిపణిని రక్షణ పరిశోధనాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) అభివృద్ధిచేసింది. దేశంలోని పలు ప్రాంతాల్లోని రక్షణరంగ తయారీసంస్థల సహకారంతో ఈ క్షిపణిని తయారుచేశారు. ఎంఐఆర్‌వీ టెక్నాలజీని జోడించిన అగ్ని-5ను గత ఏడాది మార్చినెలలో తొలిసారిగా పరీక్షించిన విషయం తెల్సిందే. తాజా ప్రయోగం విజయవంతంకావడంపై రక్షణమంత్రి రాజ్‌నాథ్ ఆనందం వ్యక్తంచేశారు.
పరిశోధన,ప్రయోగంలో పాలుపంచుకున్న డీఆర్‌డీవో, భారత సైన్యం, సంబంధిత పరిశ్రమ భాగస్వాములను ఆయన అభినందించారు. 100 కిలోమీటర్ల కంటే తక్కువ ఎత్తులోంచి దూసుకొచ్చే శత్రు క్షిపణులను మార్గమధ్యంలోనే అడ్డుకునేందుకు 2024 ఏప్రిల్‌లో భారత్ తొలిసారి ఎండో-అటామ్‌స్పిరిక్ ఇంటర్‌సెప్టార్ మిస్సైల్‌ను తొలిసారిగా పరీక్షించింది. తర్వాత ప్రతిష్టాత్మక బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తాజాగా మరోసారి అగ్ని-5 ఎంఐఆర్‌వీ సాంకేతికత సఫలంతో భారత వ్యూహాత్మక రక్షణ సామర్థ్యం మరింత పటిష్టంకానుంది. ఎంఐఆర్‌వీ టెక్నాలజీని అందిపుచ్చుకున్న అతికొద్ది ప్రపంచదేశాల సరసన భారత్ చేరింది. గతంలో అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్‌ల వద్దే ఈ టెక్నాలజీ ఉండేది. డీఆర్‌డీవో శాస్త్రవేత్తల కృషితో ఇప్పుడీ టెక్నాలజీ భారతపరమైంది.

కిమ్ హత్యకు గురైతే..!

ఈకబురు, హైదరాబాద్:
ఉత్తరకొరియా లో కిమ్ జోంగ్ ఉన్ నియంతృత్వ పాలన గురించి ఎప్పటికప్పుడు అనూహ్య విషయాలు వెలుగులోకి వస్తుంటాయి. తాజాగా అలాంటి కీలక విషయమే బయటకు వచ్చింది. ఒకవేళ ఏదైనా దాడుల్లో కిమ్ మరణిస్తే.. తక్షణమే అణుదాడులు చేసేలా ఉ.కొరియా తన విధానాలను సవరించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు మీడియాలో కథనాలు వస్తున్నాయి. అమెరికా ఇజ్రాయెల్ తొలిరోజు జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ సహా అనేక మంది సీనియర్ నాయకులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఉత్తరకొరియా ఈ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల ప్యాంగ్యాంగ్‌లో జరిగిన 15వ సుప్రీం పీపుల్స్ అసెంబ్లీ మొదటి సమావేశంలో ఈ రాజ్యాంగ సవరణను ఆమోదించినట్లు కథనాలు పేర్కొన్నాయి. ఈ మార్పులకు సంబంధించిన వివరాలను తాజాగా దక్షిణ కొరియా (South Korean)కు చెందిన నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీసెస్ (NIS) తమ ఉన్నతాధికారులతో పంచుకుంది. ఉ.కొరియా తన రాజ్యాంగంలోని అణ్వాయుధాల పాలసీని సవరించినట్లు పేర్కొంది. తాజాగా సవరించిన చట్టం ప్రకారం.. దేశ అణ్వాయుధ వ్యవస్థపై కిమ్ ఆధిపత్యం కొనసాగుతోంది. ఒకవేళ శత్రుదాడుల్లో ఆయన మరణిస్తే.. వెంటనే అణ్వాయుధ దాడులు (Nuclear Strikes) చేపట్టొచ్చు. ఇక, ఈ ఏడాది దక్షిణ కొరియా సరిహద్దు సమీపంలో దీర్ఘశ్రేణి ఆయుధ వ్యవస్థలను మోహరించాలని ప్యాంగ్యాంగ్ యోచిస్తున్నట్లు కూడా తాజాగా బయటకు వచ్చింది.

మిషన్ తెలంగాణకు షా స్కెచ్

బీఆర్ఎస్ నేతలే వారి టార్గెట్

హైదరాబాద్‌లో తిష్ట వేయనున్న బెంగాల్ టీమ్

ఈకబురు, హైదరాబాద్ :
తెలంగాణ రాజకీయ క్షేత్రంలో పాగా వేసేందుకు భారతీయ జనతా పార్టీ తన అసలైన అస్త్రాలను ప్రయోగిస్తోంది. మొన్నటి వరకు ఒక లెక్క.. ఇకపై మరో లెక్క అన్నట్లుగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పెషల్ టీమ్ రంగంలోకి దిగనుంది. పశ్చిమ బెంగాల్ వంటి క్లిష్టమైన రాష్ట్రాల్లో ఎన్నికల వ్యూహకర్తలుగా పేరుగాంచిన షా టీమ్ ఇప్పుడు తెలంగాణ గడ్డపై తిష్ట వేయనుంది. తెలంగాణలో ఈనెల 10వ తేదీన ప్రధాని మోడీ భారీ బహిరంగ సభ అనంతరం ఈ బృందం పూర్తిస్థాయిలో తెలంగాణపై దృష్టిసారించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే తమ తర్వాత టార్గెట్ తెలంగాణ అని మోడీ సభతో చెప్పకనే చెబుతున్న కాషాయ పార్టీకి.., త్వరలో షా టీమ్ తెలంగాణకు రానుందనడంతో మరింత జోష్ ను తెచ్చిపెడుతోంది. అధికారం కోసం కాషాయ పార్టీ నేతలు కన్న కలలు ఈ దెబ్బతో అయినా నిజమవుతాయనే ఆశతో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

హైదరాబాద్ కేంద్రంగా ఆపరేషన్..

తెలంగాణలో అధికారాన్ని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా బీజేపీ తన మిషన్ తెలంగాణను అత్యంత వ్యూహాత్మకంగా మలిచింది. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో మమతా బెనర్జీని సైతం ఉక్కిరిబిక్కిరి చేసిన అమిత్ షా కోర్ టీమ్, ఇప్పుడు హైదరాబాద్ కేంద్రంగా ఆపరేషన్ మొదలుపెట్టడం రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. కేవలం రాష్ట్ర స్థాయిలోనే కాకుండా, ప్రతి నియోజకవర్గంలో ఉన్న కుల సమీకరణాలు, అసమ్మతి నేతలు, మరియు ప్రజల్లో ఉన్న అసంతృప్తిపై ఈ బృందం డేటాను సేకరించనుంది.

మైక్రో మేనేజ్‌మెంట్ పై షా టీమ్ ఫోకస్..

ఢిల్లీ నుంచి వచ్చిన అమిత్ షా ప్రత్యేక దూతలు స్థానిక నేతలతో సంబంధం లేకుండా సొంతంగా సర్వేలు నిర్వహిస్తూ, ఎప్పటికప్పుడు రిపోర్టులను హైకమాండ్‌కు పంపించనున్నారు. పూర్తిస్థాయిలో మైక్రో మేనేజ్‌మెంట్ పై షా టీమ్ ఫోకస్ పెట్టనుంది. బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం నాయకత్వ సంక్షోభంలో ఉందని బీజేపీ గట్టిగా నమ్ముతోంది. ముఖ్యంగా కవిత చుట్టూ తిరుగుతున్న పరిణామాలు ఆ పార్టీకి నైతికంగా పెద్ద దెబ్బ అని బీజేపీ భావిస్తోంది. బీఆర్ఎస్‌లో అసంతృప్తితో ఉన్న ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని ఆకర్షించడం ద్వారా, ఆ పార్టీ పునాదులను దెబ్బతీయాలని షా టీమ్ ప్లాన్ చేస్తోంది. బీఆర్ఎస్ ఖాళీ చేసే స్థానాన్ని కాంగ్రెస్ కాకుండా తామే భర్తీ చేయాలనేది కాషాయ దళం అసలు ఎత్తుగడ.

బూత్ లెవల్ ఏజెంట్ వ్యవస్థ..

ఇకపోతే.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున, సహజంగానే వచ్చే ప్రభుత్వ వ్యతిరేకతని క్యాష్ చేసుకోవాలని బీజేపీ చూస్తోంది. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో జరుగుతున్న జాప్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం ఇస్తున్న నిధులను హైలైట్ చేస్తూ, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టడం ఈ వ్యూహంలో భాగంగా తెలుస్తోంది. బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌ను ఢీకొనేందుకు అనుసరించిన బూత్ లెవల్ ఏజెంట్ వ్యవస్థను తెలంగాణలోనూ బలోపేతం చేస్తున్నారు.

ప్రత్యేక శిక్షణ..

పార్టీపై నిబద్ధత గల కార్యకర్తలను గుర్తించి, వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా పోలింగ్ రోజున గట్టి ప్రభావం చూపాలని భావిస్తున్నారు. షా బృందం ఆధ్వర్యంలో ఒక భారీ సోషల్ మీడియా నెట్‌వర్క్ పనిచేస్తోంది. ప్రతిపక్షాల వైఫల్యాలను ట్రోల్ చేయడం, కేంద్ర ప్రభుత్వ విజయాలను ప్రతి గడపకు చేర్చడం ద్వారా నరేటివ్ ను తమకు అనుకూలంగా మార్చుకోవడమే వీరి పనిగా తెలుస్తోంది. బెంగాల్ తరహాలో 'షా టీమ్' ఇక్కడ కూడా అద్భుతాలు చేస్తుందా? అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది. మొత్తం మీద, తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ యాక్షన్ ప్లాన్ మొదలైందని స్పష్టమవుతోంది.

నూతన సీడీఎస్‌గా సుబ్రమణి

సీనియర్ మిలిటరీ అధికారి అయిన రాజా సుబ్రమణికి పాకిస్తాన్, చైనా సైనిక వ్యవహారాలపై అపారమైన పరిజ్ఞానం ఉంది. ఆయన గత ఏడాది జూలై 31న వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రెటేరియట్ (ఎన్ఎస్‌సీఎస్)కు సైనిక సలహాదారుగా సేవలందిస్తున్నారు. కొత్త సీడీఎస్‌గా ఈ నెల 30న బాధ్యతలు చేపట్టబోతున్నారు. అంతేకాకుండా సైనిక వ్యవహారాల విభాగం కార్యదర్శిగా కూడా ఆయన పనిచేస్తారని రక్షణ శాఖ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది.
మూడో సీడీఎస్‌గా రికార్డు
లెఫ్టినెంట్ జనరల్ రాజా సుబ్రమణి 40 సంవత్సరాలకు పైగా సైన్యంలో పని చేస్తున్నారు. సుదీర్ఘమైన ఉద్యోగ జీవితంలో సంక్లిష్టమైన, సంఘర్షణలతో కూడిన వేర్వేరు భౌగోళిక పరిస్థితుల్లో సేవలందించారు. అనేక కమాండ్, స్టాఫ్, బోధనా పదవులను నిర్వర్తించారు. రాజా సుబ్రమణి 1965 జూలై 21న ముంబైలో జన్మించారు. కళాశాల విద్య పూర్తయిన తర్వాత నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఇండియన్ మిలటరీ అకాడమీలో శిక్షణ పొందారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని జాయింట్ సర్వీసెస్ కమాండ్ స్టాఫ్ కాలేజీలోనూ చదువుకున్నారు. యూనివర్సిటీ ఆఫ్ మద్రాసులో డిఫెన్స్ స్టడీస్‌లో ఎంఫిల్ పూర్తిచేశారు. 1985 డిసెంబర్ 14న గర్వాల్ రైఫిల్స్ ఎనిమిదో బెటాలియన్‌లో చేరారు. అస్సాం, జమ్మూకశ్మీర్‌లో కీలకమైన సైనిక ఆపరేషన్లలో పాల్గొన్నారు. పశ్చిమ, ఉత్తర సరిహద్దులు, అక్కడి పరిస్థితులపై ఆయనకు గట్టి పట్టుంది. 2024 జూలై 1న వైస్ చీఫ్ ఆఫ్ ద ఆర్మీ స్టాఫ్‌గా నియమితులయ్యారు. 2025 జూలై 31 దాకా పనిచేశారు. విశిష్ట సేవా పతకం, పరమ విశిష్ట సేవా పతకంతో సహా ఎన్నో పతకాలు, పురస్కారాలు అందుకున్నారు. దేశంలో మొట్టమొదటి సీడీఎస్ జనరల్ బిపిన్ రావత్ 2021 డిసెంబర్ 8న తమిళనాడులో హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన సంగతి తెలిసిందే. తర్వాత జనరల్ అనిల్ చౌహాన్ 2022 సెప్టెంబర్‌లో రెండో సీడీఎస్‌గా నియమితులయ్యారు. లెఫ్టినెంట్ జనరల్ రాజా సుబ్రమణి భారత మూడో సీడీఎస్‌గా రికార్డుకెక్కబోతున్నారు.

జన్ సురక్ష పథకాల్లో రూ.25,160 కోట్ల క్లెయిమ్‌ల పరిష్కారం

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

దిల్లీ: ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై), అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) వంటి జన్ సురక్ష పథకాలు 2015 మే 9న ప్రారంభించినప్పటి నుంచి సుమారు రూ.25,160 కోట్ల క్లెయిమ్‌లను పరిష్కరించాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం తెలిపారు. 11 ఏళ్లు పూర్తి చేసుకున్న ఈ ప్రధాన పథకాలు..దేశ పౌరుల జీవితంలోని అనిశ్చితుల నుంచి కాపాడటం, దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించడం ద్వారా బీమా, పింఛను రంగాన్ని విస్తృతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. జన్ సురక్ష పథకాల 11వ వార్షికోత్సవం సందర్భంగా విడుదల చేసిన గణాంకాలను ఉటంకిస్తూ, పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై, ఏపీవై పథకాల కింద వరుసగా 27 కోట్లు, 58 కోట్లు, 9 కోట్లకు పైగా నమోదులు (ఎన్‌రోల్‌మెంట్స్) జరిగాయని సీతారామన్ తెలిపారు.

అనిల్ అంబానీ కార్యాలయాల్లో సీబీఐ సోదాలు

దిల్లీ: అనిల్ అంబానీకి చెందిన కంపెనీల కార్యాలయాల్లో కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) సోదాలు నిర్వహించింది. ఆయన నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్ కంపెనీలైన రిలయన్స్ టెలికాం, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్‌లపై నమోదైన కేసులకు సంబంధించి ఈ సోదాలు జరిపింది. బ్యాంక్ మోసం కేసులో ముంబయిలోని ఆయనకు సంబంధించిన 17 ప్రాంగణాల్లో సోదాలు నిర్వహించినట్లు సీబీఐ శనివారం తెలిపింది. కంపెనీల డైరెక్టర్ల నివాసాలు, బ్యాంకు నిధుల మళ్లింపునకు ఉపయోగించిన ఇంటర్మీడియరీ కంపెనీల కార్యాలయాల్లోనూ సోదాలు జరుపుతున్నట్లు సీబీఐ అధికారులు వెల్లడించారు. ఒకే చిరునామా నుంచి పలు ఇంటర్మీడియరీ కంపెనీలు పని చేస్తున్నట్లు గుర్తించామని.. దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎల్ఐసీ ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్‌పై ఇప్పటికే 7 కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో సీబీఐ ఇప్పటికే పలుమార్లు అనిల్ అంబానీ కార్యాలయాల్లో సోదాలు చేపట్టింది.

బుల్లెట్ రాజా రాయల్ ఎన్‌ఫీల్డ్

ప్రపంచంలోని బలమైన వాహన బ్రాండ్లలో మూడో స్థానం



కుర్రకారు మనసు దోచుకున్న దేశీయ బుల్లెట్ బ్రాండు 'రాయల్ ఎన్‌ఫీల్డ్'.. ప్రపంచ విపణిలోనూ దుమ్మురేపుతోంది. ప్రపంచంలోని బలమైన వాహన బ్రాండ్లలో మూడో స్థానాన్ని పొందింది. ఈ క్రమంలో ఆడి, ఫెరారీ లాంటి అంతర్జాతీయ దిగ్గజ బ్రాండ్లనూ వెనక్కి నెట్టింది. 2026 సంవత్సరానికి బ్రాండ్ ఫైనాన్స్ రూపొందించిన బలమైన వాహన బ్రాండ్ల జాబితాలో టయోటా, బీఎండబ్ల్యూలు తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. బ్రాండ్ స్ట్రెంథ్ సూచీలో 100 పాయింట్లకు 88.6 పాయింట్ల స్కోర్, ఏఏఏ రేటింగ్‌ను సాధించిన రాయల్ ఎన్‌ఫీల్డ్ మూడో స్థానంలో నిలిచింది. ఆడికి నాలుగో స్థానం, ఫెరారీకి ఏడో స్థానం లభించింది. భారత్‌కు చెందిన టాటా మోటార్స్ బ్రాండు అయిదో స్థానంలో నిలవగా.. మారుతీ సుజుకీ 6వ ర్యాంకును, మహీంద్రా అండ్ మహీంద్రా 8వ ర్యాంకును, హీరో మోటోకార్ప్ 10వ ర్యాంకును పొందాయి.

ప్రపంచంలోని 10 బలమైన వాహన బ్రాండ్లలో భారత్ నుంచి 5 కంపెనీలు చోటు దక్కించుకోవడం గమనార్హం.అంతర్జాతీయంగానూ రాయల్ ఎన్‌ఫీల్డ్‌కు ఆదరణ పెరుగుతోందనడానికి తాజాగా ఆ సంస్థ సాధించిన ర్యాంకే నిదర్శనం. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 80కి పైగా దేశాల్లో రాయల్ ఎన్‌ఫీల్డ్‌కు కార్యకలాపాలు ఉన్నాయి.ఇక ప్రపంచంలోని అత్యంత విలువైన బ్రాండ్లలో టయోటా అగ్రస్థానంలో నిలిచింది. మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ రెండు, మూడో స్థానంలో ఉన్నాయి. అత్యధిక విలువున్న 10 వాహన బ్రాండ్లలో భారత్ నుంచి ఏ సంస్థకూ చోటు దక్కలేదు.

ఏఐ టూల్.. కాస్టీ గురూ

ఉద్యోగుల వేతనాల కంటే ఎక్కువ వ్యయాలు

చిన్న కంపెనీలకు భారం

సరైన ప్రణాళిక లేకుంటే కష్టమే

ఉద్యోగుల స్థానంలో కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికత తీసుకువస్తే, వ్యయాలు తగ్గుతాయనే భావన సరికాదని అనుభవజ్ఞులు చెబుతున్నారు. ఉద్యోగుల విధులను ఆటోమేషన్ చేసేందుకు వ్యయాలు భారంగా మారుతున్నాయని సమాచారం. ఏఐ ఖర్చులు ఉద్యోగుల జీతాలను మించి కనిపిస్తున్నాయని ఎన్‌విడియా, ఉబర్ వంటి దిగ్గజ కంపెనీల ఎగ్జిక్యూటివ్‌లు చెబుతున్నారు. ఇందులో ఒక కంపెనీ తమ ఏఐ ప్రొవైడర్ నుంచి భారీ బిల్లు అందుకుందట. ఈ నేపథ్యంలో.. ఆటోమేషన్‌పై పెట్టుబడులు కొనసాగుతున్నా.. మనుషులను ఏఐతో భర్తీ చేస్తే, నిజంగా వ్యయాలు తగ్గుతాయా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

వినియోగదార్లకు వేరే.. కంపెనీలకు వేరే.. ఏఐ ఆటోమేషన్ వైపు వెళుతున్న కంపెనీలకు.. ఇపుడు ఏఐ టూల్స్ వ్యయాలు, తమ ఉద్యోగుల వేతనాల కంటే మరీ అధికంగా ఉన్నాయని అర్థమయిందని ఎన్‌విడియా, ఉబర్ ఎగ్జిక్యూటివ్‌లు చెబుతున్నారు. ప్రస్తుతం కంపెనీలు కోడింగ్ అసిస్టెంట్లను, ఆటోమేషన్ ఏజెంట్లను వినియోగించడం పెరిగింది. ఆయా స్థానాల్లో పనిచేసిన ఉద్యోగుల వ్యయాలతో పోలిస్తే, కంప్యూట్ వ్యయాలు చాలా అధికంగా ఉంటున్నాయట. చాలా వరకు వినియోగదారు ఏఐ అసిస్టెంట్‌స్‌ను సబ్‌స్క్రిప్షన్ ప్లాన్లపై ప్రొవైడర్లు అందిస్తున్నారు. కానీ ఎంటర్‌ప్రైజ్ ఏఐ వ్యయాలకు మాత్రం టోకెన్ వినియోగానికి లంకె ఉంటుంది. ఏఐ ఆధారిత కోడింగ్, ఆటోమేషన్, షెడ్యూల్డ్ టాస్క్‌లు కొనసాగే కొద్దీ వ్యయాలు పెరుగుతూ వెళతాయి.

ఏఐ వాడకం తప్పదు.... అయినా ఆటోమేషన్‌పై చిన్నాపెద్దా తేడా లేకుండా సంస్థలన్నీ పెట్టుబడులను కొనసాగిస్తున్నాయి. తమ కంపెనీకి చెందిన లైవ్ కోడ్ అప్‌డేట్‌లలో 11% వరకు ఏఐ ఏజెంట్లే రాస్తున్నాయని ఉబర్ సీటీఓ ప్రవీణ్ నాగ అంటున్నారు. ఒక సీటీఓగా తాను సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ నుంచి ఏఐ ఏజెంట్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్‌కు మార్పు చెందాల్సిన అవసరం కనిపిస్తోందన్నారు. ఎన్‌విడియా సీఈఓ జెన్సెన్‌హ్యూంగ్ సైతం ఏఐ వినియోగాన్ని ఇంజినీర్లు పెంచుకోవాలని చెబుతున్నారు. ఏటా 2 లక్షల డాలర్లను సంపాదిస్తున్న ఇంజినీర్లు, ఏఐ టోకెన్లపై ఏటా లక్ష డాలర్లను ఖర్చు చేయాలని సూచిస్తున్నారు.

సమర్థతపైనా ప్రశ్నలు... ఇప్పటికే ఏఐ వ్యయాలపై అంచనాలు భారీగా పెరిగాయని ఉబర్ సీటీఓ ప్రవీణ్ నాగ చెబుతున్నారు. ఇది పెద్ద కంపెనీలకే పరిమితం కాలేదు. స్వాన్‌ఏఐకి చెందిన అమోస్ బార్‌జోసెఫ్ మాట్లాడుతూ తమ వద్ద నలుగురు ఉద్యోగులు పనిచేసే బృందానికి బదులు, ఆంత్రోపిక్ నుంచి 1,13,000 డాలర్ల బిల్లు వచ్చిందని చెప్పారు. అంటే ఒక్కో ఉద్యోగికి నెలకు 28,000 డాలర్లన్నమాట. నిజంగా మనుషులతో పోలిస్తే ఏఐ చౌకా కాదా అన్న అంశంపై చర్చను ఈ వ్యయాలు లేవనెత్తుతున్నాయి. సమర్థత విషయానికొస్తే ఏఐతో పోలిస్తే 77% కేసుల్లో మనుషులే బాగా పని చేసినట్లు ఎమ్ఐటీ నివేదిక ఒకటి పేర్కొంది.

కంపెనీలు ఇపుడు ఏం చేయాలి?..... కంపెనీలు ఇపుడు ఏఐ వ్యయాలను తాత్కాలిక పెట్టుబడులుగా భావించాలా లేదంటే, టోకెన్ వ్యయాలు తమ వేతన బిల్లులకు శాశ్వతంగా జత అవుతాయని అనుకోవాలా అని మదనపడుతున్నాయి. అదే సమయంలో ఏఐ వ్యూహాలు లేని కంపెనీలకు భారీ నష్టాలూ తప్పవని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. సరైన ప్రణాళిక లేకుండా ఏఐని అందిపుచ్చుకోవడం కోసం చాలా వరకు కంపెనీలు పరుగులు తీసి, ప్రతిఫలాలను పొందడంలో ఇబ్బందులూ పడుతున్నాయి. ఏఐని అందిపుచ్చుకునే క్రమంలో కంపెనీలు లేఆఫ్‌లు చేపట్టే అవకాశమూ లేకపోలేదు.

సెమాగ్లుటైడ్ ధరలు తగ్గాయ్

ఏడాది కాలంలో 80% చౌక

మార్చిలో పేటెంట్ గడువు పూర్తి

రంగంలోకి దేశీయ ఫార్మా దిగ్గజాలు

హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా మధుమేహం, ఊబకాయం చికిత్సలో సంచలనం సృష్టిస్తున్న సెమాగ్లుటైడ్ మందుల మార్కెట్‌లో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఒకప్పుడు చుక్కలనంటిన ఈ మందు తయారీకి వాడే యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రేడియెంట్ (ఏపీఐ) ధరలు ఇప్పుడు అమాంతం నేల చూపులు చూస్తున్నాయి. గత ఏడాది కాలంలో ఈ ధరలు 80 శాతం మేర పడిపోవడం విశేషం. ముఖ్యంగా భారత మార్కెట్‌లో సెమాగ్లుటైడ్ పేటెంట్ గడువు మార్చిలో ముగియడంతో, దేశీయ ఫార్మా దిగ్గజాలు రంగంలోకి దిగడం ఈ ధరల పతనానికి ప్రధాన కారణంగా నిలుస్తోంది. ఈ పరిణామం భారతీయ జెనరిక్ కంపెనీలకు వరంగా మారింది. సామాన్య వ్యాధిగ్రస్తులకు బరువు తగ్గే మందులు అతి తక్కువ ధరకే అందుబాటులోకి రానున్నాయి. గతంలో సెమాగ్లుటైడ్ ఏపీఐ సరఫరా డానిష్ ఫార్మా దిగ్గజం నోవో నార్డిస్క్ వంటి కొన్ని కంపెనీల చేతుల్లోనే ఉండేది. దీంతో మార్కెట్లో ఒక గ్రాము సెమాగ్లుటైడ్ ఏపీఐ ధర ఏకంగా 900 డాలర్ల (రూ.83,000) వరకూ పలికేది. కానీ, ప్రస్తుతం ఈ ధరలు అమాంతం 160 డాలర్ల (రూ.14,500)కు పడిపోయాయి.

దేశీయ కంపెనీల కన్ను.. భారత్‌లో సుమారు 10 కోట్లకు పైగా మధుమేహ వ్యాధిగ్రస్తులు, 13.5 కోట్లకు పైగా ప్రజలకు ముందస్తు మధుమేహం ఉన్నట్లు అంచనా. 25 కోట్ల మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. దీంతో ఈ మందులకు దేశీయంగా భారీ గిరాకీ ఉంటుందని దేశీయ కంపెనీలు భావిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 2030 నాటికి బరువు తగ్గించే మందుల మార్కెట్ రూ.94,000 కోట్లకు (100 బిలియన్ డాలర్లు) చేరుకుంటుందని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. ఇందులో భారత మార్కెట్ విలువ రూ.9,300 కోట్లుగా ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు భారత్‌లోని దాదాపు 50కి పైగా కంపెనీలు సెమాగ్లుటైడ్ జనరిక్ ఔషధాన్ని విడుదల చేశాయి.

తక్కువ ధరకే.. ప్రపంచ ఫార్మా రాజధానిగా పిలిచే హైదరాబాద్ ఈ మార్కెట్‌ను శాసించే దిశగా అడుగులు వేస్తోంది. డాక్టర్ రెడ్డీస్, నాట్కో, హెటిరో, ఎంఎస్ఎన్ ఫార్మాలు సెమాగ్లుటైడ్ జనరిక్ ఔషధాన్ని మార్కెట్లోకి తీసుకొచ్చాయి. సన్‌ఫార్మా, జైడస్ లైఫ్ సైన్సెస్, గ్లెన్‌మార్క్, లుపిన్, ఎరిస్ లైఫ్ సైన్సెస్ వంటి సంస్థలూ పోటీపడుతున్నాయి. ఏడాది క్రితం వరకూ నోవో నార్డిస్క్ ఉత్పత్తులైన వెగోవీ ఖర్చు నెలకు రూ.16,400, ఓజెంపిక్ ఖర్చు నెలకు రూ.11,000 వరకూ ఉండేవి. పేటెంట్ ముగిసిన తర్వాత దేశీయ సంస్థలు జనరిక్ వెర్షన్ల ధర నెలకు రూ.1,290 నుంచి రూ.4,200 వరకూ అందిస్తున్నాయి. మరోవైపు ఈ విభాగంలో తన గుత్తాధిపత్యం కాపాడుకునేందుకు నోవో నార్డిస్క్ సైతం తన మందుల ధరలను దాదాపు 48 శాతం మేర తగ్గించింది.

నోటి మాత్రల రూపంలోనూ.. ప్రస్తుతం ప్రీఫిల్డ్ డిస్పోజబుల్ పెన్ రూపంలో వస్తున్న ఈ ఔషధాలు.. రానున్న కొన్ని రోజుల్లో మాత్రల రూపంలోనూ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ విషయంలో డాక్టర్ రెడ్డీస్‌కు గత నెలలోనే సీడీఏఎస్‌సీఈ అనుమతినిచ్చింది. వీటి ఉత్పత్తి ఎప్పటి నుంచి అనే విషయంలో ప్రస్తుతం స్పష్టత లేదు. మాత్రల రూపంలో అందుబాటులోకి వస్తే.. ఖర్చు మరింత తగ్గుతుందని అంచనా. అంతేకాకుండా, గ్రామీణ ప్రాంతాలకూ ఈ మందును సరఫరా చేయడం సులభం అవుతుంది. రాబోయే రెండేళ్లలో సెమాగ్లుటైడ్ మాత్రల మార్కెట్ 60 శాతానికి చేరుతుందని అంచనా. కొన్ని చైనా సంస్థలూ ఈ జీఎల్‌పీ1 (గ్లూకాగాన్‌లైక్ పెప్టైడ్) ఔషధాల నోటి మాత్రల అభివృద్ధిని వేగవంతం చేశాయి. ఇవి అందుబాటులోకి వస్తే ధరల యుద్ధం మరింత పెరిగే అవకాశం ఉంది.

ఈ అనూహ్య పతనానికి ప్రధానంగా మూడు కారణాలున్నాయి...

పేటెంట్ ముగింపు: భారత్‌లో 2026 మార్చితో ఓజెంపిక్, వెగోవీ మందుల పేటెంట్ గడువు ముగియడంతో, దేశీయ కంపెనీలు తమ జెనరిక్ వెర్షన్లను మార్కెట్లోకి విడుదల చేశాయి.

తయారీ విధానంలో మార్పు: గతంలో ఈ మందును 'రికంబినెంట్ డీఎన్ఏ' అనే ఖరీదైన పద్ధతిలో తయారు చేసేవారు. కానీ, ఇప్పుడు తక్కువ ఖర్చుతో కూడిన 'కెమికల్ సింథసిస్' పద్ధతి అందుబాటులోకి రావడంతో ఉత్పత్తి వ్యయం భారీగా తగ్గింది.

పెరిగిన సరఫరా: చైనా, భారత్‌కు చెందిన దాదాపు 3040 ప్రధాన ఏపీఐ తయారీ సంస్థలు భారీ ఎత్తున ఉత్పత్తిని ప్రారంభించాయి.

ఈ ఏడాది మారుతీ నుంచి 3 కార్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) నుంచి 3 కొత్త కార్లు రానున్నాయి. ఇందులో కాంపాక్ట్ ఎస్‌యూవీ అయిన బ్రెజా ఫేస్‌లిఫ్ట్ వెర్షన్, సరికొత్త వ్యాగన్ ఆర్, 7 సీట్ల ఎస్‌యూవీ (స్పోర్ట్స్ వినియోగ వాహనం) ఉంటాయని సమాచారం. దేశీయంగా అధిక సంఖ్యలో విక్రయమవుతున్న బ్రెజా ఇంటీరియర్, ఎక్స్‌టీరియర్‌లను ఆధునికీకరించి, మరిన్ని సదుపాయాలు జతచేసి ఫేస్‌లిఫ్ట్ ఎడిషన్‌ను మారుతీ తీసుకువస్తోంది. డ్యాష్‌బోర్డు, ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్లు కూడా సరికొత్తగా ఉంటాయని చెబుతున్నారు. పనోరమిక్ సన్‌రూఫ్ కూడా ఉంటుంది.

పెట్రోల్, సీఎన్‌జీ ఆప్షన్లలో లభించనుంది.వ్యాగన్ ఆర్ డిజైన్, ఫీచర్స్‌లోనూ మార్పులు చేస్తూ, సరికొత్తగా సంస్థ ఆవిష్కరించనుంది. అయితే సుజుకీ హెర్టెక్ట్ ప్లాట్‌ఫాంపైనే ఈ కారు ఉంటుంది. ప్రస్తుతం మారుతీ నుంచి 6 ఎస్‌యూవీలు ఉండగా, 7 సీట్లతో తెస్తున్న కొత్త ఎస్‌యూవీ ఈ విభాగాన్ని బలోపేతం చేస్తుందని చెబుతున్నారు. మహీంద్రా స్కార్పియో ఎన్, హ్యుందాయ్ అల్కజార్‌తో పోటీపడేలా దీన్ని ఆవిష్కరించే వీలుంది.

బ్యాంక్ ఆఫ్ బరోడా లాభం రూ.5616 కోట్లు

బ్యాంక్ ఆఫ్ బరోడా, మార్చి త్రైమాసికంలో రూ.5,616 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. 202425 ఇదే కాల లాభం రూ.5,048 కోట్ల కంటే ఇది 11% ఎక్కువ. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.35,852 కోట్ల నుంచి రూ.36,609 కోట్లకు పెరిగింది. ఇందులో వడ్డీ ఆదాయమే రూ.30,642 కోట్ల నుంచి రూ.32,642 కోట్లకు చేరింది.

స్థూల నిరర్థక ఆస్తుల (జీఎన్‌పీఏ) నిష్పత్తి 2.26% నుంచి 1.89 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.58% నుంచి 0.45 శాతానికి మెరుగయ్యాయి. 2025 26 పూర్తి ఆర్థిక సంవత్సరానికి రూ.20,021 కోట్ల నికరలాభాన్ని బ్యాంక్ నమోదు చేసింది. 202425 లాభం రూ.19,581 కోట్ల కంటే ఇది 2% ఎక్కువ. మొత్తం ఆదాయం కూడా రూ.1,38,089 కోట్ల నుంచి రూ.1,42,750 కోట్లకు చేరింది. రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.8.50 డివిడెండ్ చెల్లించాలని బోర్డు ప్రతిపాదించింది.

మినిస్టర్‌వైట్ ప్రచారకర్త నాగార్జున

పురుషుల సంప్రదాయ దుస్తుల ప్రీమియం బ్రాండ్ మినిస్టర్ వైట్ ప్రచారకర్తగా సినీనటుడు అక్కినేని నాగార్జునను నియమించారు. విశిష్టమైన వారసత్వం ఆకర్షణ కలిగిన నాగార్జున ప్రచారం.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో తమ బ్రాండ్‌కు మరింత ప్రాచుర్యం తెస్తుందని మినిస్టర్ వైట్ క్లాతింగ్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ సురేశ్ రామసుబ్రమణియన్ తెలిపారు.

'రావు బహదూర్' జులైలో..

సత్యదేవ్ కథానాయకుడిగా... వెంకటేశ్ మహా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రావు బహదూర్' జులై 3న రానుంది. కొత్తగా ఖరారైన ఈ తేదీని శుక్రవారం చిత్రబృందం ప్రకటించింది. చింతా గోపాలకృష్ణారెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్‌చంద్ర కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని జి.ఎమ్.బి.ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై మహేశ్‌బాబు, నమ్రత శిరోద్కర్ సమర్పిస్తున్నారు. సత్యదేవ్ సరసన దీపా థామస్ కథానాయికగా నటిస్తోంది. వికాస్ ముప్పాల, బాలా పరాశర్, ఆనంద్ భారతి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. రాజసం ఉట్టిపడే పాత్రలు, విజువల్స్‌తో సరికొత్త అనుభవాన్ని పంచే చిత్రమిదని సినీవర్గాలు చెప్పాయి.

రాయవలసకు ఆధారం నిజ జీవితం

కార్తీక్ జయంతి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'రాయవలస'. రాధిక జయంతి దర్శకత్వం వహిస్తున్నారు. గోపీకృష్ణ.జె నిర్మాత. శుక్రవారం హైదరాబాద్‌లో టీజర్ ఆవిష్కరణ వేడుక జరిగింది. యువ కథానాయకుడు ఆకాశ్ జగన్నాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కథానాయకుడు కార్తీక్ మాట్లాడుతూ ''నేను నా జీవితంలో ప్రేమించింది సినిమానే. నా కలని తమ కలగా మార్చుకుని ఈ సినిమా చేశారు నా తల్లిదండ్రులు. నిజ జీవితం ఆధారంగా, అందరూ కనెక్ట్ అయ్యేలా రూపొందించిన చిత్రమిది'' అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.

ఎనిమిదేళ్ల విరామం తర్వాత.. పనులు మొదలు

'అరవింద సమేత' చిత్రంతో సినీప్రియుల్ని మెప్పించారు కథానాయకుడు ఎన్టీఆర్ దర్శకుడు త్రివిక్రమ్. ఈ ఇద్దరూ 8ఏళ్ల విరామం తర్వాత మరో కొత్త సినిమా కోసం తిరిగి చేతులు కలపనున్నారు. దీనికి సంబంధించి ఈనెల 20న తారక్ పుట్టినరోజు సందర్భంగా అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది. ఇందు కోసమే చిత్ర బృందం ఓ ప్రత్యేక వీడియోను సిద్ధం చేయిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం దీనికి సంబంధించిన పనులు మొదలైనట్లు తెలిసింది. ఇది యుద్ధ దేవుడైన కుమారస్వామి (కార్తికేయుడు) స్ఫూర్తితో రూపొందనున్న చిత్రమని తెలుస్తోంది. దీనికి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు ఏడాది చివర్లో మొదలు కానుండగా.. రెగ్యులర్ చిత్రీకరణ వచ్చే ఏడాది ప్రథమార్ధంలో ప్రారంభమయ్యే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. దీన్ని హారిక హాసిని క్రియేషన్స్ సంస్థ నిర్మించనుంది.

'గ్యాంగ్‌లీడర్'కు 35ఏళ్లు..

'చేయి చూశావా ఎంత రఫ్‌గా ఉందో రఫ్ఫాడించేస్తా' అనే మాస్ డైలాగ్‌లతో అగ్ర కథానాయకుడు చిరంజీవి (Chiranjeevi) ప్రేక్షకులను అలరించిన చిత్రం 'గ్యాంగ్ లీడర్' (Gang Leader). విజయ బాపినీడు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఒకవైపు యాక్షన్, క్రైమ్ సీక్వెన్స్‌తో సాగుతూనే మరోవైపు విజయశాంతి, చిరు మధ్య కెమిస్ట్రీ, ప్రేమ పాటలతో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఇప్పటికీ ప్రేక్షకులను ఆకట్టుకుంటూనే ఉంది. మే 9, 1991న విడుదలైన ఈ మూవీ 35 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా బ్లాక్‌బస్టర్ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర విశేషాలు..



దర్శకుడు విజయ బాపినీడు తొలుత అనుకున్న కథ వేరు. తన మనసుకు బాగా నచ్చిన ఫ్యామిలీ డ్రామా 'బొమ్మరిల్లు' (1978) తరహా కథతో చిరంజీవి సోదరుడు నాగబాబుతో సినిమా తీయాలని అనుకున్నారు. 'షోలే'లోని గబ్బర్ సింగ్ డైలాగ్ ప్రేరణతో 'అరె ఓ సాంబా' అని టైటిల్ పెట్టాలనుకున్నారు. అనివార్య కారణాలతో ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కలేదు. అప్పటికే బాపినీడు 'మెగాస్టార్' సినీ మ్యాగజైన్‌ను నడుపుతున్నారు. అందులో సినీ రచయిత సత్యమూర్తి (సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ తండ్రి) 'గ్యాంగ్ లీడర్' పేరుతో సీరియల్ రాయడం మొదలు పెట్టారు. ఆ టైటిల్‌ను తీసుకుని, తాను మొదట అనుకున్న కథలో మార్పులు చేసి, చిరంజీవికి వినిపించారు. బాపినీడు చెప్పిన కథ నచ్చకపోవడంతో చిరంజీవి ఎలాంటి మొహమాటం లేకుండా చేయనని చెప్పేశారు.చిరు నో చెప్పిన 'గ్యాంగ్‌లీడర్' కథను ఒకానొక సందర్భంలో పరుచూరి బ్రదర్స్‌కు వినిపించారు దర్శకుడు బాపినీడు. కథ విన్న వెంటనే పరుచూరి బ్రదర్స్ మూడు రోజులు టైమ్ ఇస్తే మొత్తం మార్చి ఇస్తాను అని దర్శకుడికి మాట ఇచ్చారు. ఇందుకు చిరు కూడా సరే అనడంతో బాపినీడు రాసిన కథకు కొన్ని ఆసక్తికర విషయాలను జోడించి చిరుకి పరుచూరి గోపాలకృష్ణ వినిపించారు. కథ విన్న వెంటనే సినిమా చేయడానికి చిరు ఒప్పుకొన్నారు.బాపినీడు రాసిన 'గ్యాంగ్‌లీడర్' కథలో మురళీమోహన్‌తో పాటు హీరో స్నేహితులు కూడా ఒకేసారి మృతి చెందుతారు. ఈ కథను బాపినీడు చెప్పగానే.. 'అందరూ ఒకేసారి చనిపోతే ఆసక్తి ఏం ఉంటుంది. గ్యాంగ్ లేకుండా అసలు గ్యాంగ్‌లీడర్‌కు అర్థం ఏం ఉంటుంది' అని పరుచూరి బ్రదర్స్ అడిగారట. అలా పరుచూరి గోపాలకృష్ణ.. అందరూ ఒకేసారి చనిపోకూడదనే ఉద్దేశంతో కొన్ని మార్పులు చేసి ఇప్పుడు మనం చూస్తున్న 'గ్యాంగ్‌లీడర్' సినిమా కథగా మార్చారు. అంతేకాకుండా విజయశాంతి, రావుగోపాలరావు పాత్రల్లో కూడా ఆసక్తి ఉండేలా మార్పులు చేశారు. గోపాలకృష్ణ చెప్పిన కథ నచ్చడంతో డేట్స్ చూడమని అల్లు అరవింద్‌కి చిరు సూచించారు. గోపాలకృష్ణ కథ చెబుతున్నప్పుడు అరవింద్ రికార్డ్ చేసుకున్నారని ఒకానొక సందర్భంలో పరుచూరి బ్రదర్స్ తెలిపారు. 'ఎందుకు రికార్డ్ చేసుకుంటున్నారు' అని అడగగానే.. 'మీరు మాటలతో మాయాజాలం చేసేస్తారు. కాబట్టి ఇంటికి వెళ్లాక ఒక్కసారి ఈ కథను విని ఎలా ఉందో చెబుతాను' అని అరవింద్ అన్నారట.రఘుపతి (మురళీమోహన్), రాఘవ (శరత్ కుమార్), రాజారామ్ (చిరంజీవి) అనే ముగ్గురు అన్నదమ్ముల సెంటిమెంట్‌తో కథను తీర్చిదిద్దారు. స్నేహితులతో కలసి అల్లరిచిల్లరగా తిరిగే నిరుద్యోగ యువకుడైన హీరో.. తన కుటుంబాన్ని కాపాడుకోవడమే కాక, సొంత అన్నయ్యను అన్యాయంగా చంపిన విలన్లను తుదముట్టించడం కథాంశం.

మే 9, 1991న విడుదలైన 'గ్యాంగ్‌లీడర్' తెలుగు బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. చిరంజీవి నటన, యాక్షన్, డ్యాన్స్, విజయశాంతితో కెమిస్ట్రీకి తెలుగు సినీ ప్రేక్షకులు నీరాజనం పట్టారు. 50కి పైగా థియేటర్లలో 100 రోజులు విజయవంతంగా ప్రదర్శించారు.100 రోజుల వేడుకలు అద్భుతంగా జరిగాయి. తిరుపతి, విజయవాడ, ఏలూరు, హైదరాబాద్ కేంద్రాలలో ఏకకాలంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు చిరంజీవి , చిత్ర బృందం హెలికాప్టర్‌లో తరలిరావడం అప్పట్లో హాట్ టాపిక్. హైదరాబాద్‌లోని సుదర్శన్ థియేటర్‌లో 162 రోజుల పాటు 'గ్యాంగ్‌లీడర్'ను ప్రదర్శించారు.'గ్యాంగ్‌లీడర్' పేరుతోనే డబ్బింగ్ చేసి తమిళంలో విడుదల చేయగా, అక్కడా విజయం సాధించింది. తమిళంలో చిరంజీవికి సాయికుమార్ డబ్బింగ్ చెప్పడం విశేషం. కేరళలో తమిళ వెర్షన్‌ను రిలీజ్ చేస్తే, అక్కడా మంచి వసూళ్లు సాధించింది. హిందీలోనూ 'ఆజ్‌కా గూండారాజ్'తో చిరంజీవితోనే రీమేక్ చేశారు. మీనాక్షి శేషాద్రి కథానాయిక.తెలుగులో చిరంజీవి పిన్ని కొడుకు దుర్గబాబు నటించిన ఫ్రెండ్ పాత్రను హిందీ వెర్షన్‌లో రవితేజ చేయడం విశేషం. అప్పట్లో హిందీ మూవీ పాటలను లియో సంస్థ క్యాసెట్ల రూపంలో మార్కెట్లోకి తెచ్చింది. ఒక హీరో తెలుగు సినిమా హిందీలో రీమేకై, మళ్లీ ఆ హిందీ రీమేక్ పాటలు తెలుగులోకి డబ్బింగ్ అవడం అరుదైన ఘటన.

పాటలో మెప్పించిన తండ్రీ కొడుకులు

చిరు కెరీర్‌లో ఎన్నో సూపర్‌హిట్ సాంగ్స్ ఉన్నాయి. అందులో 'గ్యాంగ్‌లీడర్' సినిమాలోని 'వానా వానా వెల్లువాయే' పాట ఒకటి. ఈ పాటలో చిరువిజయశాంతి హావభావాలు ఆకట్టుకునేలా ఉంటాయి. ఈ సూపర్‌హిట్ పాటను రామ్‌చరణ్ కథానాయకుడిగా నటించిన 'రచ్చ' సినిమాలో రీమేక్ చేశారు. 2012లో విడుదలైన ఈ సినిమాలో చెర్రీతమన్నా డ్యాన్స్ థియేటర్‌లో ప్రేక్షకులతో విజిల్స్ వేయించింది.

ఈ మూవీ హిట్టయితే 'దృశ్యం 4, 5' కూడా రావొచ్చు..మోహన్‌లాల్

'దృశ్యం 3' బాక్సాఫీస్ వద్ద విజయవంతమైతే 'దృశ్యం 4, 5' కూడా రావొచ్చని అగ్ర కథానాయకుడు మోహన్‌లాల్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆయన కీలకపాత్రలో జీతూ జోసెఫ్ దర్శకత్వంలో రూపొందిన మిస్టరీ థ్రిల్లర్ 'దృశ్యం 3'. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ మే 21న (drishyam 3 release date) ప్రేక్షకుల ముందుకు రానుంది. శనివారం చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మోహన్‌లాల్ మాట్లాడారు. ''ఈ కథ మొదలై 13ఏళ్లు అయింది. 'దృశ్యం 3'లో జార్జి కుట్టి ప్రతి కదలిక తెరపై అలరిస్తుంది. కథ, కథనం పాత్రలు కూడా బలంగా ఉంటాయి. ఈ సినిమాకీ క్లైమాక్స్ ప్రత్యేకంగా ఉంటుంది. రెండు కుటుంబాలు, వాళ్లు అనుభవిస్తున్న బాధ ఇందులో కనిపిస్తుంది. ఇద్దరు తల్లుల మనోవేదన కనిపిస్తుంది. జార్జి కుట్టి మనసులో భయంకరమైన భారం ఉంటుంది. దాన్ని ఎలా అధిగమించాడన్నది చూస్తారు. 'దృశ్యం 4' కూడా రావాలని నేను కోరుకుంటున్నా. నిర్మాత ఆంటోనీ అయితే, ఐదోది కూడా చేద్దామన్న ఉత్సాహంతో ఉన్నారు. అది జరుగుతుందా? లేదా? అనేది ఈ సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులు నిర్ణయిస్తారు. చివరిగా చెప్పేది ఒక్కటే.. జార్జి తన కుటుంబం కోసం ఏమైనా చేస్తాడు. అదే ఈ సినిమా'' అని అన్నారు.మలయాళంతో పాటు, ఇతర భాషల్లోనూ 'దృశ్యం' చిత్రాలు ఎంతటి ఘన విజయాన్ని సాధించాయో అందరికీ తెలిసిందే. భారీ అంచనాల మధ్య 'దృశ్యం 3' వస్తున్న నేపథ్యంలో దర్శకుడు జీతూ ప్రేక్షకులకు ఒక సూచన చేశారు. మరీ ఎక్కువ అంచనాలు పెట్టుకుని సినిమాకు రావొద్దని అన్నారు. మూవీలో కచ్చితంగా సర్‌ప్రైజ్ ఎలిమెంట్స్ ఉన్నాయని, సినిమా మొత్తం అవే ఉంటాయని అనుకోవద్దన్నారు. కుట్టి, అతడి కుటుంబ భావోద్వేగాలపైనే ఎక్కువగా దృష్టి పెట్టినట్లు తెలిపారు. కథలో అవి బలంగా ఉంటాయన్నారు. మొదటి రెండు చిత్రాలకు, పూర్తి భిన్నంగా మూడోసినిమా ఉంటుందన్నారు. ఇక ఈ సందర్భంగా విడుదల చేసిన ట్రైలర్ చూస్తుంటే, పోలీసులే చేతులెత్తేసిన వరుణ్ కేసును ఛేదించడానికి ఈసారి మీడియా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. మరి దానిని ఎదుర్కొనేందుకు, తన కుటుంబాన్ని కాపాడుకునేందుకు జార్జి కుట్టి ఏం చేశాడన్నది చూడాలంటే మే 21వ తేదీ వరకూ వేచి చూడాల్సిందే!

ఈ రోజుల్లో రూ.100 కోట్లు పెద్ద విశయమేం కాదు..అమీషా పటేల్

నటి అమీషా పటేల్ సోషల్ మీడియా వేదికగా యువ హీరోయిన్‌లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'గదర్ 2'తో భారీ విజయాన్ని అందుకున్న ఆమె (Ameesha Patel) ప్రస్తుతం ఉన్న హీరోయిన్‌లు వారి క్రేజ్‌ను పెంచుకోవడానికి పీఆర్ టెక్నిక్స్ వాడుతున్నారంటూ వరుస పోస్ట్‌లు పెట్టారు. "బాక్సాఫీస్‌లో చరిత్ర సృష్టించినప్పుడు మాత్రమే మిమ్మల్ని మీరు సూపర్‌స్టార్ అని పిలుచుకోండి. అప్పటివరకూ పీఆర్ గేమ్‌లు ఆపండి. మీరు బాధపడినా ఇది చేదు నిజం. తమ కెరీర్‌లో ఇప్పటివరకు ఒక్క సోలో బ్లాక్‌బస్టర్ కూడా సాధించని చాలామంది హీరోయిన్‌లు ఏడాదికి రెండు సినిమాలు చేస్తూ తమను తాము స్టార్‌లుగా పిలుచుకుంటున్నారు. కేవలం షూటింగ్ సెట్స్‌లో ఉన్నంతమాత్రాన మీరు స్టార్ అయిపోరు. మీరు కేవలం ఒక ప్రాజెక్ట్‌లో భాగమైన నటులు మాత్రమే అవుతారు" "తమ కెరీర్‌లో కనీసం ఒక్క సినిమా కూడా రూ.200 కోట్ల క్లబ్‌లో చేరని హీరోయిన్‌లు తమ పీఆర్ టీమ్‌లకు డబ్బులు ఇచ్చి తమను తాము నంబర్ 1, నంబర్ 2 అని పిలిపించుకుంటున్నారు. ఇది 2026.. 2000 సంవత్సరం కాదు. ఈ రోజుల్లో రూ.100 కోట్లు అంటే పెద్ద విషయం కాదు. హీరోయిన్‌గా నేను మూడు అతిపెద్ద సోలో బ్లాక్‌బస్టర్ హిట్‌లలో నటించా. ఇప్పటికీ అవి నా కో-స్టార్స్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్స్. కానీ ఇతర హీరోయిన్‌లలా నేను పీఆర్‌లతో ప్రచారాన్ని చేసుకోవడం లేదు" అని తన పోస్ట్‌లలో రాసుకొచ్చారు.

శ్రేయస్ అయ్యర్ కాదు..
టీ20 కెప్టెన్‌గా సంజు శాంసన్!

ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన తర్వాత టీమ్‌ఇండియాలో కీలక మార్పులు జరగబోతున్నాయి. ఇప్పటికే ఆ దిశగా సంకేతాలు కనిపిస్తున్నాయి. రెండేళ్లుగా జట్టును నడిపిస్తున్న సూర్యకుమార్ యాదవ్‌పై వేటు పడటం ఖాయంగా కనిపిస్తోంది. కొత్త సారథిగా శ్రేయస్ అయ్యర్ పేరు వినిపించగా.. తాజాగా సంజుశాంసన్ కూడా రేసులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత టీమ్‌ఇండియా మ్యాచ్‌లు ఆడలేదు. జూన్ నెలాఖరులో ఐర్లాండ్‌తో రెండు టీ20ల సిరీస్‌తో కొత్త సీజన్‌ను ఆరంభించబోతోంది. ఐపీఎల్ ముగిసిన తర్వాత సెలక్షన్ కమిటీ సమావేశం కానుంది. అప్పుడు కొత్త సారథిగా సంజు శాంసన్‌ను ప్రకటిస్తారని సమాచారం. టీ20 ప్రపంచకప్‌లో కీలక ఇన్నింగ్స్‌లు ఆడటం, ప్రస్తుతం ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరపున అదరగొడుతుండటం, రాజస్థాన్‌కు సారథ్యం వహించిన అనుభవం ఉండటంతో శాంసన్ వైపు సెలక్టర్లు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఐపీఎల్ సీజన్‌లో శాంసన్ ఇప్పటివరకు 10 మ్యాచ్‌లు ఆడి 402 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీ ఉన్నాయి. ఐపీఎల్‌లో సారథిగా, ఆటగాడిగా రాణిస్తున్నప్పటికీ చాలాకాలంగా టీ20 జట్టుకు దూరంగా ఉండటం శ్రేయస్‌కు ప్రతికూలంగా మారినట్లు సమాచారం. అతను భారత్ తరపున చివరి టీ20 మ్యాచ్ డిసెంబర్, 2023లో ఆడాడు. ఇప్పుడు జట్టులోకి తీసుకుని నేరుగా కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించడం రిస్క్‌గా భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, ఐర్లాండ్, ఇంగ్లాండ్ టూర్‌లో సూర్యకుమార్ యాదవ్‌ను ఆటగాడిగా జట్టులోకి కొనసాగించే వీలుందట. ఆ సిరీస్‌ల్లోనూ సూర్య విఫలమైతే అతడిని టీమ్‌ను నుంచి తప్పించాలని సెలక్టర్లు భావిస్తున్నారట.

గుజరాత్.. పైపైకి

ఏడో విజయంతో రెండో స్థానానికి

ఐపీఎల్ 19 లీగ్ దశ ముందుకు సాగేకొద్దీ సమీకరణాలు మారిపోతున్నాయి. ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా మారుతోంది. పైనున్న జట్లు ఒకొక్కటిగా కిందికి దిగుతుంటే.. కింద ఉన్న జట్లు పైకి వెళ్తున్నాయి. కాస్త ఆలస్యంగా నిలకడ అందుకున్న గుజరాత్ టైటాన్స్.. వరుసగా నాలుగో విజయంతో అదరగొట్టింది. రాజస్థాన్ రాయల్స్‌ను చిత్తుగా ఓడించిన ఆ జట్టు.. పాయింట్ల పట్టికలో అయిదు నుంచి ఒకేసారి రెండో స్థానానికి ఎగబాకింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మెరుపు ఇన్నింగ్స్‌తో జట్టుకు భారీ స్కోరు అందిస్తే.. స్పిన్నర్ రషీద్ ఖాన్ విజృంభణతో ఛేదనలో రాజస్థాన్ చతికిలపడింది.

ఐపీఎల్19లో గుజరాత్ దూసుకెళ్తోంది. శనివారం ఆ జట్టు 77 పరుగుల తేడాతో రాజస్థాన్‌ను చిత్తు చేసింది. మొదట శుభ్‌మన్ గిల్ (84; 44 బంతుల్లో 9×4, 3×6), సాయి సుదర్శన్ (55; 36 బంతుల్లో 6×4, 2×6), వాషింగ్టన్ సుందర్ (37 నాటౌట్; 20 బంతుల్లో 2×4, 3×6) చెలరేగడంతో గుజరాత్ 4 వికెట్లకు 229 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం రషీద్ ఖాన్ (4/33) ధాటికి విలవిలలాడిన రాయల్స్ 16.3 ఓవర్లలో 152 పరుగులకే కుప్పకూలింది. రబాడ (2/33), హోల్డర్ (3/12) కూడా ప్రత్యర్థిని దెబ్బ తీశారు. రవీంద్ర జడేజా (38; 25 బంతుల్లో 3×4, 2×6) టాప్‌స్కోరర్. 11 మ్యాచ్‌ల్లో గుజరాత్‌కిది ఏడో గెలుపు కాగా.. అన్నే మ్యాచ్‌లు ఆడిన రాయల్స్ అయిదో ఓటమి చవిచూసింది.

ఆ వికెట్ పడగానే..: లక్ష్యం పెద్దదైనా.. సూపర్ ఓపెనింగ్ జోడీ, బలమైన బ్యాటింగ్ ఆర్డర్ ఉన్న రాయల్స్ స్థాయికి తగ్గ ప్రదర్శన చేస్తే ఛేదన మరీ కష్టమేమీ కాదు. ముఖ్యంగా వైభవ్ సూర్యవంశీ తనదైన శైలిలో చెలరేగితే.. తమ పని తేలికైపోతుందని రాజస్థాన్ ఆశించే ఉంటుంది. ఆ ఆశలకు తగ్గట్లే వైభవ్ జట్టుకు మెరుపు ఆరంభాన్నిచ్చాడు. తొలి 17 బంతుల్లో ఒక్కటి మాత్రమే యశస్వికి ఆడే అవకాశమిచ్చిన వైభవ్.. 3 ఫోర్లు, 3 సిక్సర్లు బాదేసి గుజరాత్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. కానీ అతడు.. సిరాజ్ బౌలింగ్‌లో మరో భారీ షాట్‌కు ప్రయత్నించి అర్షద్ ఖాన్‌కు దొరికిపోవడంతో రాయల్స్ జోరుకు బ్రేక్ పడింది. ఆ వెంటనే యశస్వి (3), హెట్‌మయర్ (6)లను వరుస ఓవర్లలో ఔట్ చేయడంతో రాజస్థాన్ అవకాశాలకు గండిపడింది. సిరాజ్ వేసిన అయిదో ఓవర్లో మూడు సిక్సర్లు, ఒక ఫోర్ బాదిన జురెల్ జోరుమీదుండడం, జడేజా కూడా ఆరంభం నుంచే ధాటిగా ఆడడంతో రాజస్థాన్‌కు విజయం మీద ఆశలు రేగాయి కానీ.. రషీద్ ఆ జట్టును కోలుకోలేని దెబ్బ తీశాడు. ఒకే ఓవర్లో జురెల్, డొనోవన్ ఫెరీరా (4)లను ఔట్ చేశాడు. శుభమ్ దూబె (15), జడేజా కూడా అతడి బౌలింగ్‌లోనే ఔటైపోవడంతో రాజస్థాన్‌కు పరాభవం ఖాయమైపోయింది. హోల్డర్ లోయ రార్డర్ పనిపట్టడంతో 21 బంతులుండగానే ఇన్నింగ్స్ ముగిసింది.

కెప్టెన్ నడిపించాడు: మొదట టాస్ గెలిచి బౌలింగ్ చేసిన రాజస్థాన్.. ఆ నిర్ణయానికి చింతించేలా సాగాయి ఆ జట్టు బౌలింగ్, గుజరాత్ బ్యాటింగ్. ఈ సీజన్లో పలు మ్యాచ్‌ల్లో రాయల్స్‌కు అదిరే ఆరంభాన్నిచ్చిన ఆర్చర్.. ఈ మ్యాచ్‌లో బౌలింగ్‌ను పేలవంగా ఆరంభించాడు. తొలి ఓవర్లో అతను నాలుగు వైడ్లు, ఒక నోబాల్ వేశాడు. మొత్తంగా 9 అదనపు పరుగులు వచ్చాయి. ఆర్చర్‌తో కొత్త బంతిని పంచుకున్న తుషార్ దేశ్‌పాండే కూడా అదుపు తప్పడంతో జీటీ ఓపెనర్లు పరుగుల పంట పండించుకున్నారు. చేంజ్ బౌలర్‌గా వచ్చిన బ్రిజేశ్ శర్మ సైతం తేలిపోయాడు. గిల్, సుదర్శన్ పోటాపోటీగా ఫోర్లు, సిక్సర్లు బాదుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. 6 ఓవర్లకే స్కోరు 82 పరుగులకు చేరుకుంది. సుదర్శన్, గిల్ స్వల్ప వ్యవధిలో అర్ధశతకాలు పూర్తి చేసుకున్నారు. ఇద్దరూ సరిగ్గా 30 బంతుల్లోనే ఆ మార్కును అందుకోవడం విశేషం. 11వ ఓవర్లో టైటాన్స్ 118/0తో తిరుగులేని స్థితికి చేరుకుంది. అయితే స్పిన్నర్లు పుంజా (1/37), జడేజా (1/34) పొదుపుగా బౌలింగ్ చేస్తూ గుజరాత్‌పై ఒత్తిడి తీసుకురాగలిగారు. సుదర్శన్‌ను పుంజా, బట్లర్ (13)ను జడేజా ఔట్ చేశారు. కానీ గిల్‌ను మాత్రం రాజస్థాన్ ఆపలేకపోయింది. అర్ధశతకం తర్వాత వేగం పెంచిన గిల్ చూస్తుండగానే 80ల్లోకి వచ్చేశాడు. సెంచరీ చేసేలా కనిపించిన అతణ్ని బ్రిజేశ్ ఔట్ చేసినా.. సుందర్ ధాటిగా ఆడి స్కోరును 200 దాటించాడు. 19వ ఓవర్లో గొప్పగా బౌలింగ్ చేసిన బ్రిజేశ్ (2/47).. 4 పరుగులే ఇచ్చి, హోల్డర్ (7) వికెట్ తీయగా.. ఆఖరి ఓవర్లో తుషార్ తేలిపోయాడు. తెవాతియా రెండు సిక్సర్లు.. సుందర్ ఒక సిక్సర్ బాదడంతో ఈ ఓవర్లో మొత్తం 20 పరుగు లొచ్చాయి.

స్కోరు వివరాలు

గుజరాత్ ఇన్నింగ్స్: సుదర్శన్ (సి) ఆర్చర్ (బి) పుంజా 55; శుభ్‌మన్ (సి) తుషార్ (బి) బ్రిజేశ్ 84; బట్లర్ (సి) ఫెరీరా (బి) జడేజా 13; సుందర్ నాటౌట్ 37; హోల్డర్ (సి) యశస్వి (బి) బ్రిజేశ్ 7; తెవాతియా నాటౌట్ 14; ఎక్స్‌ట్రాలు 19 మొత్తం: (20 ఓవర్లలో 4 వికెట్లకు) 229; వికెట్ల పతనం: 1-118, 2-150, 3-185, 4-205; బౌలింగ్: ఆర్చర్ 3-0-46-0; తుషార్ దేశ్‌పాండే 4-0-52-0; బ్రిజేశ్ శర్మ 4-0-47-2; యశ్ రాజ్ పుంజా 4-0-37-1; జడేజా 4-0-34-1; ఫెరీరా 1-0-11-0

రాజస్థాన్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) నిశాంత్ (బి) రబాడ 3; వైభవ్ (సి) అర్షద్ (బి) సిరాజ్ 36; జురెల్ (బి) రషీద్ ఖాన్ 24; హెట్‌మయర్ (సి) హోల్డర్ (బి) రబాడ 6; జడేజా ఎల్బీ (బి) రషీద్ ఖాన్ 38; డొనోవన్ ఫెరీరా (బి) రషీద్ ఖాన్ 4; శుభమ్ దూబె (బి) రషీద్ ఖాన్ 15; శానక (సి) గిల్ (బి) హోల్డర్ 16; ఆర్చర్ (సి) బట్లర్ (బి) హోల్డర్ 5; తుషార్ (సి) సుందర్ (బి) హోల్డర్ 1; బ్రిజేశ్ శర్మ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 3 మొత్తం: (16.3 ఓవర్లలో ఆలౌట్) 152; వికెట్ల పతనం: 1-38, 2-40, 3-68, 4-87, 5-91, 6-115, 7-136, 8-141, 9-151; బౌలింగ్: సిరాజ్ 4-0-55-1; రబాడ 3-0-33-2; సాయి కిశోర్ 1-0-8-0; రషీద్ ఖాన్ 4-0-33-4; సుందర్ 2-0-10-0; హోల్డర్ 2.3-0-12-3

బీసీసీఐ ఆదేశాల వెనుక...?

బెంగళూరు: ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా ఆటగాళ్లు, సహాయ సిబ్బంది, జట్టు అధికారుల హోటల్ గదుల్లోకి అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని నిషేధిస్తూ బీసీసీఐ ఆదేశాలు జారీ చేయడం వెనుక బలమైన కారణాలే ఉన్నట్లు తెలుస్తోంది. హోటళ్లకు వస్తున్న కొందరు వ్యక్తులు అనుమతి లేని ప్రదేశాల్లో రీల్స్ చేయడం, ఆటగాళ్లు వారితో కలిసి రాత్రి పార్టీలకు వెళ్తుండడం బీసీసీఐ దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా హార్దిక్ పాండ్య సహా కొందరు క్రికెటర్ల గర్ల్‌ఫ్రెండ్స్ మైదానాల్లోకి కూడా వచ్చి హడావుడి చేయడాన్ని బీసీసీఐ తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. మరోవైపు ఐపీఎల్ జట్లు, ఆటగాళ్ల ప్రచార వీడియోల కోసం వస్తున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు అనుమతి లేని ప్రదేశాలకు వెళ్లి రీల్స్ చేసినట్లు బీసీసీఐ గుర్తించింది. ఆటగాళ్లు, సహాయ సిబ్బంది, అధికారులు.. అమ్మాయిల ఉచ్చులో పడి మ్యాచ్‌లకు సంబంధించిన సమాచారాన్ని బయటికి పొక్కేలా చేసే ప్రమాదం ఉందని బీసీసీఐ అవినీతి నిరోధక బృందం హెచ్చరించడంతో బోర్డు షరతులు విధించినట్లు ఐపీఎల్ వర్గాలు తెలిపాయి.

సీఎస్కే మ్యాచ్‌లకు అత్యధిక వ్యూస్..
తర్వాత ఏ టీమ్ ఉందంటే?

ఐపీఎల్ 2026 ప్రథమార్థంలో మ్యాచ్‌లు కాస్త చప్పగా సాగినప్పటికీ.. సెకండాఫ్‌లో జట్లు నువ్వానేనా అన్నట్లు తలపడుతున్నాయి. దీంతో సాయంత్రమైతే చాలు క్రికెట్ అభిమానులు టీవీలు, మొబైళ్లకు అతుక్కుపోతున్నారు. ఇక చెన్నై సూపర్ కింగ్స్, ఆర్సీబీ వంటి జట్ల మ్యాచ్‌లనైతే ఫ్యాన్స్ మరింత ఆసక్తిగా చూస్తున్నారు. ఈ క్రమంలో మే 1 వరకు జరిగిన మ్యాచ్‌ల టీవీ, డిజిటల్ స్ట్రీమింగ్ డేటా లెక్కల ఆధారంగా బ్రాడ్‌కాస్టర్ స్టార్ స్పోర్ట్స్ ఓ నివేదికను రూపొందించింది. సీఎస్కే మ్యాచ్‌లను అత్యధిక మంది వీక్షిస్తున్నట్లు అందులో వెల్లడైంది. చెన్నై మ్యాచ్‌లను సగటున 308 మిలియన్ల మంది వీక్షిస్తున్నారు. ధోనీ ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్‌లో ఆడనప్పటికీ సీఎస్కే మ్యాచ్‌లకు ఈ స్థాయిలో క్రేజ్ ఉండటం విశేషం.

విరాట్ కోహ్లీ ప్రాతినిధ్యం వహిస్తున్న డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టీమ్ మ్యాచ్‌లకు సగటున 303 మిలియన్ల మంది చూస్తున్నారు. ఈ సీజన్‌లో ముంబయ ఇండియన్స్ ఆశించిన మేరకు ప్రదర్శన చేయకపోయినప్పటికీ ఆ జట్టుకు క్రేజ్ మాత్రం తగ్గలేదు. ముంబయి మ్యాచ్‌లను సగటున 293 మిలియన్ల మంది వీక్షిస్తున్నట్లు స్టార్ స్పోర్ట్స్ తెలిపింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ (290 మిలియన్లు), కోల్‌కతా నైట్‌రైడర్స్ (280 మిలియన్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

యశస్వి, షెఫాలీలకు నాడా నోటీసులు



దిల్లీ: డోప్ పరీక్షలకు అందుబాటులో ఉండనందుకు భారత క్రికెటర్లు యశస్వి జైస్వాల్, షెఫాలి వర్మలకు జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) నోటీసులు పంపింది. నిరుడు పరీక్షకు హాజరు కాలేకపోవడానికి కారణం చెప్పకపోవడంతో ప్లేయర్లు నోటీసులు అందుకోవాల్సి వచ్చింది. "సంబంధిత అథ్లెట్లకు నాడా నోటీసులు పంపింది. ఈ విషయాన్ని బీసీసీఐ, ఐసీసీకి తెలిపింది" అని నాడా వర్గాలు తెలిపాయి. బీసీసీఐ వర్గాలు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించాయి. "నాడా నుంచి మాకు సమాచారం వచ్చిన మాట నిజమే. ఇలాంటివి భవిష్యత్తులో జరగకుండా తగిన చర్యలు తీసుకుంటాం. క్రికెట్‌కు తిరిగి ఒలింపిక్స్‌లో చోటు లభించింది. మేం అన్ని ప్రొటోకాల్స్‌ను పాటించాలి. అప్పుడే అంతా సవ్యంగా సాగుతుంది" అని ఓ బీసీసీఐ అధికారి చెప్పాడు. అథ్లెట్లు నాడాకు తమ ఆచూకి చెప్పడం తప్పనిసరి. పరీక్షల కోసం ప్రతి రోజూ నిర్ణీత సమయంలో అందుబాటులో ఉండాలి. మూడు సార్లు పరీక్షలకు డుమ్మా కొడితే డోపింగ్ నిబంధనలను ఉల్లంఘించినట్లవుతుంది. అది సస్పెన్షన్‌కు దారితీయొచ్చు

వినేశ్ జూన్ 26 వరకు పోటీపడలేదు: డబ్ల్యూఎఫ్ఐ

దిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్) శనివారం స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసింది. వినేశ్ క్రమశిక్షణరాహిత్యానికి పాల్పడిందని, డోపింగ్ నిబంధనలను ఉల్లంఘించిందని అరోపించింది. యూడబ్ల్యూడబ్ల్యూ డోపింగ్ నిరోధ నిబంధనల ప్రకారం జూన్ 26 వరకు ఆమె పోటీ పడేందుకు అనర్హురాలని చెప్పింది. రిటైర్మెంట్ నుంచి వచ్చే రెజ్లర్ ఆరు నెలలు నోటీసు కాలంలో ఉండాలని పేర్కొంది. అంటే పునరాగమనం కోసం వినేశ్ నిరీక్షించాలన్నమాట. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో అనర్హతకు గురైన అనంతరం ఆమె ఆటకు గుడ్‌బై చెప్పిన సంగతి తెలిసిందే. ఆదివారం గొండాలో మొదలయ్యే జాతీయ ఓపెన్ ర్యాంకింగ్ ఈవెంట్లో ఆమె పోటీ పడాలనుకుంది. డబ్ల్యూఎఫ్ఐ పోటీపడకుండా తనను అడ్డుకుంటోందని ఇంతకుముందు ఆరోపించింది. ఇక డబ్ల్యూఐఎఫ్.. వినేశ్‌కు పంపిన 15 పేజీల నోటీసులో అనేక ఉల్లంఘనలను ప్రస్తావించింది. డబ్ల్యూఎఫ్ఐ ప్రకారం.. 2028 ఒలింపిక్స్ లక్ష్యంగా తాను తిరిగి ఆటలోకి రావాలనుకుంటున్నట్లు నిరుడు డిసెంబరు 12న సాయ్, రెజ్లింగ్ సమాఖ్యకు వినేశ్ తెలిపింది. ఆ తర్వాత ఆరు రోజులకే డోపింగ్ నిరోధక అధికారులు ఆమెకు పరీక్షలు నిర్వహించాలని అనుకున్నారు. కానీ వారికి ఆమె ఆచూకీ తెలియలేదు. దీన్ని ఆమె పరీక్షకు డుమ్మా కొట్టినట్లుగా అంతర్జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఐటీఏ) పరిగణించింది.

టాప్4లో నిలిచే జట్లు ఇవే..
ఆ టీమ్ ప్లే ఆఫ్స్ కు వస్తే ఆపడం కష్టం: అశ్విన్

ఐపీఎల్ 2026 సీజన్ కీలక దశకు చేరుకుంటోంది. లీగ్ దశలో మరో 19 మ్యాచ్‌లు మిగిలుండగా ఇప్పటికీ ఒక్క టీమ్ కూడా ప్లే ఆఫ్స్ బెర్తును ఖరారు చేసుకోలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుత సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించే జట్లను మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అంచనా వేశాడు. శుక్రవారం కోల్‌కతా నైట్‌రైడర్స్ చేతిలో పరాజయం పాలైన ఏడో ఓటమిని మూటగట్టుకున్న దిల్లీ క్యాపిటల్స్ ముందంజ వేయడం కష్టమేనని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. కేకేఆర్ కూడా ప్లే ఆఫ్స్‌కు చేరకపోవచ్చని, ఒకవేళ ఆ జట్టు టాప్4లో నిలిస్తే ప్రమాదకరంగా మారుతుందని పేర్కొన్నాడు. ''దిల్లీ క్యాపిటల్స్ ప్లే ఆఫ్స్ చేరుకునేలా కనిపించడం లేదు. కేకేఆర్ కూడా ఈ రేసులో వెనుకబడిపోతుందని నేను భావిస్తున్నాను. ఒకవేళ కోల్‌కతా అర్హత సాధిస్తే ఆ జట్టును ఆపడం కష్టం. నైట్‌రైడర్స్ పుంజుకున్న తీరు అద్భుతం. అందుకే కేకేఆర్ మూడు టైటిళ్లు సాధించింది. లీగ్ దశ ముగిసేసరికి సన్‌రైజర్స్ హైదరాబాద్, ఆర్సీబీ టాప్ 2లో నిలుస్తాయని అనుకుంటున్నా. గుజరాత్ టైటాన్స్, రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్‌లలో ఏవైనా రెండు జట్లు మూడు, నాలుగు స్థానాల్లో ఉంటాయి. చెన్నై సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్స్‌కు రావాలంటే మిగిలిన నాలుగు మ్యాచ్‌ల్లో మూడు గెలవాలి. లఖ్‌నవూతో జరగబోయే రెండు మ్యాచ్‌ల్లో సీఎస్కే విజయం సాధిస్తే కచ్చితంగా ప్లే ఆఫ్స్ చేరుతుంది'' అని అశ్విన్ విశ్లేషించాడు.